# బహిష్కృతులు

"అమ్మా...బూచి..." వాకిట్లోకి బయలుదేరిన వేణు కెవ్వున కేక వేయటంతో శారద ఉరుక్కుంటూ వచ్చింది. వేణు తల్లిని గట్టిగా కౌగిలించుకుని వణికిపోతున్నాడు. శారద గబగబా రెండడుగులు వెనక్కువచ్చి తలుపు దభేలుమని వేసేసి 'పోయాడులే బూచి' అంటూ వీపు మీద చరిచింది. వేణు వణుకు తగ్గలేదు. శారద గుండెల్లో కెలికినట్టయింది. వేణు తల్లి తొడలమీద తల పెట్టుకొని అక్కడే చాపమీద పడుకున్నాడు.

శారద అలా కూర్చున్నదే గాని వాకిటి తలుపు దగ్గర మనిషి కదులుతున్నట్లు, తలుపు చప్పుడు చేస్తున్నట్లు వూహించుకుంటూనేఉంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వినపడుకున్నాయి. వేణుకి కొంచెం నిద్ర పట్టడంతోటే కాలిమీద నుంచి తలను చాపమీదకు కదలకుండా దించి వాకిటి దగ్గరకు చూడటానికి పోయింది. గడ్డాలు...మీసాలు..అతనక్కడే ఉన్నాడు.

శారద ముఖమంతా చెమటలు క్రమ్మినాయి. కెవ్వున కేక వేయాలన్నంత ఆవేశం కలిగింది గాని భయంతో ఆ పని చేయలేకపోయింది. ఆ చీకటిలో మనిషి ముఖంమీద నీటిబిందువులు జలజలా రాలటం కనిపించింది. కన్నీరై వుండాలి.

'నేను వచ్చాను శారదా...!' అన్నాడతను ఎంతో గంభీరంగానూ, ఆవేశంగానూ ప్రతి అక్షరం ఒత్తి పలుకుతూ. శారద స్తబ్ధురాలైంది. ఆమె హృదయం లిప్తపాటు ఆగి విపరీతంగా కొట్టుకోసాగింది.

'మీరా...వచ్చారా...' అంటూ అతని ముఖాన్ని గుర్తించి గబగబా ముందుకుపోయి అతని మీద వాలిపోయింది.

అతని పేరు రమణ.

రమణ ఆమెను పైకి లేవదీసి 'పద..తొందరగా పద లోపలకు' అంటూ ఆమెను తీసుకుని లోపలకు వెళ్లాడు. వెంటనే గడియ పడి పోయింది.

'ఎలా వచ్చారు? ఇప్పుడెలా రాగలిగారు?' అంటూ శారద కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది. వేణు నిదపోతూ 'తాను చూచిన బూచి'నిగూర్చి కలవరిస్తూ మధ్య మధ్య పలవరిస్తున్నాడు.

'అన్నీ చెబుతాను. ముందు ఆకలిగా వుంది...ఏదన్నా వుంటే పెట్టు' అన్నాడు రమణ.

శారదకు ఏం చెయ్యాలో, చెయ్యగూడదో తెలియటంలేదు. విప రీతంగా తికమక పడుతూ గదిలోకి, వంటింట్లోకి తిరుగుతోంది. ఎదు రుగా వున్న నిప్పుపెట్టె, విసనకర్రలే కనిపించడం పెద్ద శ్రమ అయి పోయింది. కుంపటి రాజెయ్యడానికి కాగితాలు దొరకలేదు. పాతగుడ్డ చింపి, దానిమీద లాంతరులోనుంచి కిరసనాయలు వంచి నిప్పు చేసింది. అన్నం వండింది. రమణ అంతసేపూ పెద్దగా నిట్టూరుస్తూ చాప మీద గోడకు ఆనుకుని కూర్చున్నాడు.

అన్నం ఉడకడంతోనే పూర్తిగా ఉమ్మగిలకుండానే ఆ వేడివేడి

అన్నాన్ని ఆవురావురుమంటూ తినేశాడు. తింటున్నంత సేపూ అతని ప్రాణమంతా వాకిటి తలుపు మీద, ఎవరన్నా వస్తారేమోనన్న భయం చేతా ఆరాటపడుతున్నది. శారద ఏదీ గమనించే స్థితిలో లేదు. ఏ ఆపద ముంచుకు రానున్నదో నన్న భయంతో గజగజ లాడిపోతోంది.

అలాగే వణికిపోతూ 'ఎలా వచ్చారు..' అని అడిగింది మళ్ళీ.

'అంతా చెపుతాను...కంగారు పడక..'అంటూ తాపీగా రమణ చెయ్యి కడుక్కొని చాప మీద చేరగిలబడి 'అబ్బాయి నిద్ర పోతున్నాడు గాదూ' అన్నాడు. శారద ఆ గంభీర వాతావరణాన్ని భరించలేక పోతు న్నది. పెద్ద తుఫాను రాబోయేముందు వుండే ఉమ్మదం లాగా వుంది.

'అవును..మనవాడే!' అంది శారద.

'ఎలా వచ్చావని అడిగావు కాదూ...పారిపోయి వచ్చాను. భయ పడకు. అన్నీ ఆలోచించే వచ్చాను. నా జీవితంలో మంచి పనులు చేయ గలగటానికి ఇది నాంది. పునాది అవుతుంది. నా చదువు నన్ను దగా చెయ్యనివ్వదు.....!' అంటుండే అతని ముఖం కందిపోయింది. పెదిమలు వణుకుతున్నాయి. నుదుటమీద చెమట పట్టి సన్నని తెరలాగా కనిపిస్తు న్నది. శారద అతని ముఖం వంకనే విస్మయంతోచూస్తూ కూర్చుండి పోయింది.

"ఎలా రాగలిగారు.....కాపలా లేదూ...మళ్లీ పట్టుకోరూ..." శారద మెల్లిగా అడగగలిగింది ఎంతో ప్రయత్నంమీద. వేణు ఇంకా నిద్రపోతునే వున్నాడు. రమణ శారద కళ్లలోకి సూటిగా చూస్తూ 'నన్ను క్షమించదగ్గవా రెవ్వరూ లేరు శారదా...ఇంక నేను ఏ నిజాన్నీ దాచ నవసరంలేదు...జరిగిందంతా చెబుతాను...భయపడక...కేకలు వెయ్యక..

పసివాడు వేణు...నన్ను చూచి బూచి అనుకున్నాడు...గడ్డాలు మీసాలు వాడిని దగా చేసినాయి...ఇప్పుడు నా బాహ్యస్వరూపమే బూచి...నేను మారిపోయాను శారదా ...నువ్వు నమ్మగలవని నీతో చెబుతున్నాను. అన్నీ విను... మధ్యలో ప్రశ్నించకు... నన్ను క్షమించగలవని నీకు నమ్మకం కుదిరితే నా జీవితంలో ఒక కొత్త దశ ప్రారంభమవుతుందనే ఆశతో బ్రతకగలుగుతాను...అందుకే నీతో అంతా చెబుతాను..." అన్నాడు రమణ. శారద తల వూపింది. రమణ ప్రారంభించాడు.

''నన్ను ఇంటిదగ్గర నుంచి తీసుకువెళ్లిన పోలీసులారీ స్టేషను చేరేటప్పటికి సుమారు పది గంటలవుతుంది. చుట్టూ తుపాకులు పట్టుకుని పోలీసులు నిలబడటం నా కెంతో అవమానకరంగానూ అసహ్యకరంగానూ అనిపించింది. నోరు మెదపగల సమయం కాదది. నా చదువు నాకు ఆమాట చెప్పగలిగింది. ఆ అవమానకరమైన చూపులను అలాగే భరిస్తూ లారీలో కింద కూర్చున్నాను. వాళ్ల బూటు కాళ్ల నుండి రాలిన ధూళి నాకు పీఠమయింది. చేతులకు వేసిన బేడీలు ఎంతో బరువుగా అనిపించినాయి. అంతకంటె బరువుగా తోచినాయి వాళ్ల చూపులు.

స్టేషను దగ్గర లారీ ఆగటంతోనే పోలీసు జవాను ఒకడు నా చెయ్యి పట్టుకుని నిర్దాక్షిణ్యంగా ఒక్క గుంజు గుంజాడు. కింద పడే వాడినే. పట్టుకుందామంటే చేతులకు బేడీలు అడ్డు వస్తున్నాయి.

''తోపుకు తట్టుకోలేక లారీకి పోయి కొట్టుకున్నాను. ముఖానికి తగిలింది. ఆనాడయిన గాయం మచ్చ యింకా మాసిపోలేదు శారదా...'' అంటూ రమణ ముఖం తడుముకుంటుంటే శారద కళ్లల్లో

నీళ్ళు ఆగలేదు. 'ఏడవ వద్దని ముందే చెప్పలేదూ...' అంటూ చూశాడు రమణ. శారద 'చెప్పండి...చెప్పండి... ఇంక ఏడవను' అన్నట్లు కళ్ల తుడుచుకుంది. రమణ మళ్లీ ప్రారంభించాడు.

''ముఖాన నెత్తురు చిందితే తుడుచుకోలేని దౌర్భాగ్యపు స్థితిలో వున్నాను. పోలీసు జవాను నన్ను బరబరా స్టేషను లోపలకు లాక్కుపోయాడు. అక్కడ నా పేరు, విలాసం అన్నీ వ్రాసుకున్నారు. అందులో నా కేమీ విశేషం కనిపించలేదు. ఆ రిజిష్టరులో ఎన్నో వందల పేర్లున్నాయి. వాళ్లంతా గూడా విచారణ గురించి వచ్చినవారే అయి వుంటారని అనిపించింది. అక్కడే ముఖం వాల్చుకుని నిలబడ్డ నన్ను చూచి సబినెస్పెక్టరు గామాలు వచ్చాడు నవ్వుకుంటూ. ఆ విషపు నవ్వు నా కర్ణపుటాల్లో తెరలు తెరలుగా ప్రతిధ్వనిస్తూ నా మనస్సును కదిలించి వేసింది. 'పాపం' అని జాలిపడాలి అనిపించింది. ముఖం ఎత్తి గంభీరంగా అతని వంక చూచాను.

'ఏంరా. . . .?' గద్దింపు అతని స్వరం. ఏకవచన సంబోధన కటువుగాతోచింది నాకు. 'మర్యాదగా మాట్లాడండి...'. అని చెబుదామనిపించింది.'చూడు...వీడి ముఖం చూడరా...' అంటూ నా ముఖాన్ని రెండు చేతుల్లో పైకెత్తి పక్కనున్న పోలీసుకు చూపించాడు. అతనికి కొంచెం భయమో, గౌరవమో కలిగింది నేనంటే.

కాలవ్యయం ఎందుకన్నట్లు నన్ను తీసుకుని వెళ్లిపోయాడు బయటికి.

అసలు కారాగారవాసమంటే ఆరోజు బాగా తెలిసి వచ్చింది. హాయిగా ఎక్కడికి కావాలంటే అక్కడికి తిరగగల స్వేచ్ఛలోని నిజమైన

విలువ కటకటాల వెనుక వున్నప్పుడు నాకు స్పష్టంగా కనిపించింది. నన్ను కారాగారంలో బంధించినందుకు నాకు కలిగిన ఆందోళన కన్నా, ఇటు వంటి కారాగారాల ఉనికి మన ఆర్యావర్తంలో ఎంతకాలం నుంచి వున్నదో, ఎంతమంది అర్హులు ఈ నల్లటి ఇనుప కటకటాల వెనక మగ్గిపోయారో, ముందు ముందు ఎన్ని సంవత్సరాలపాటు ఈ కారాగారాలు మన దేశంలో వుండబోతున్నాయో...ఈ ఆలోచనలు నన్ను విపరీతంగా కలవర పెట్టి నాయి. ఈ కారాగారంలో నేనున్నాననిగాదు. ఎవరున్నా ఒకటే అనిపించింది ఆ క్షణంలో. కారాగారాల్లో మనుష్యు లున్నారన్న భావన కంటే కారాగా రాలున్నాయన్న నగ్నసత్యం దారుణ భావనలా కనిపించి నా మనశ్శాంతిని కలుషితం చేసింది. బొక్కెన నీళ్ళలో సిరా కలిసినట్లయింది నా హృద యంలో. ఆ ఇనుప చువ్వలకేసి తల బాదుకొనటంకంటె ఏమీ చెయ్య లేక పోయాను ఆ క్షణంలో.

ఆ రోజు సాయంత్రందాకా మా సంగతి చూసిన వాళ్ళు ఎవరూ లేరు. 'మా' అని ఎందు కన్నానంటే ఇదే సందర్భంగా నాతోపాటు వచ్చిన వ్యక్తిగూడా నాతోపాటే కారాగార ప్రవేశం చేశాడు. మా ఇద్దరినీ ఒకే గదిలో వుంచినట్లయితే కొన్ని నిజాలు బయటకు వచ్చేవనుకుంటాను. సత్యానికి కటకటాలు గూడా అడ్డురాగల చెడురోజు లనిపించింది. కొంచెం సుగుణ మేమంటే నే నున్న గదికి ఎదురుగానే ఉంటుంది అతని గది గూడా. కొంచెం బిగ్గరగామాట్లాడుకుంటే పకళ్లకు పకళ్లు విన బడతారు.

రోజూ పది, పదకొండు గంటలకల్లా అన్నంతినే అలవాటుతో అక్కడ సాయంత్రం నాలుగు గంటలకన్నా మా ముఖం చూసేవాళ్లు లేక పోవటంతో నీరసం వచ్చింది. ఇలా అకస్మాత్తుగా రావటం గూడా

మాలో ఉన్న నవనాడులన్నిటిని కుంగదీసింది. చెవులు దిబ్బెళ్లు పడ్డట్లుగా అనిపించింది. కళ్లల్లోకి నీళ్లు రావటంలేదు. ఎర్రబడి మండుతున్నాయి.

నాలుగు గంటలు కచేరీలో కొట్టిన కాసేపటికి ఎవరో బంట్రోతు వచ్చాడు. అతను మాతో మాట్లాడలేదు. మా యిద్దరివంక చూసి చేత్తో ఎవరికోసమో సంజ్ఞ చేశాడు. ఇద్దరు పోలీసులు తుపాకులు ధరించి నా గది దగ్గరకు వచ్చారు. బంట్రోతు తలుపు తీస్తుండగా కటకటాల నీడ తుపాకి చివర వున్న కత్తిమీద పడి తళతళా మెరిసింది. ఆ బల్లెం నా గుండెల్లో దూసుకుపోయినట్లనిపించింది.

'తింటానికేం లేదూ?' అని అడిగాను. బంట్రోతు జాలిగానావంక చూశాడు. 'అక్కడ దొరుకుతుందిలే పద...' అన్నట్లు చూశాడు ఒక పోలీసు నా కెందుకనో భయం వేసింది. కోపాన్నంతా మింగుకుని వారి వెంట నడిచి వెళ్లాను. హడావుడిగా రావటంలో కాళ్ల చెప్పులు తెచ్చుకోలేదు. సన్ననిరాయి జైలు ఆవరణలో కాళ్లకు గుచ్చుకుంటే చాలా మంట పుట్టింది. ఆకలిబాధతో అది స్వల్పంగానే అనిపించింది ఆ సమయానికి.

'ఇడుగోనండి...' అంటూ ఎవరో పోలీసు పెద్దకు నన్ను పరిచయంచేసి నాతో వచ్చిన వాళ్లిద్దరూ గది బయటకు పోయి నిలబడ్డారు. నాతోబాటు వచ్చిన రెండవ మనిషిని గూడా తీసుకు వచ్చారు ఆ గదిలోకి. చింపిరి జుట్టు, తలపాగా, చిరిగిన ధోవతి, దుమ్ము కొట్టుకున్న శరీరం. అదీ అతని ఆకారం. నిర్లక్ష్యంగా వచ్చి నిలబడ్డాడు. అతని ధోరణి చూస్తే అక్కడివాళ్లందరూ ఎరిగిన ముఖాలేగా అన్నట్లు అనిపిస్తోంది.

'మిమ్మల్ని ఎందుకు పిలిచానో తెలుసా...' అన్నాడు అక్కడి పోలీసు పెద్ద. అతని ఖాకి వేషం, చేతిలో చింత బరికె అతని అధికారాన్ని, అహంకారాన్ని సూచిస్తున్నాయి. కళ్లల్లో కాఠిన్యం ఉట్టిపడుతోంది. 'అతని కళ్లెప్పుడూ నీళ్లు కార్చివుండవు' అనుకున్నాను. అతను గట్టిగా మాట్లాడుతుంటే గుండె బెదురు కలిగింది. కొద్దిగా ధైర్యం చేసుకుని ఏదైనా అడుగుదామని అనిపించింది. అతని చూపులు ఎటువంటి సమ ధానాల్నీ అర్థిస్తున్నట్లు కనిపించలేదు. 'ప్రశ్నలు వినండి' అని గదమాయిస్తున్నట్లున్నాయి.

'మిమ్మల్ని పిలిచిందెందుకో తెలుసా' మళ్లీ రెట్టిస్తూ అడిగాడతను.

'తెలియదు...' అన్నాను కొంచెం ధైర్యంచేసి.

'బ్రూట్...తెలియదేం...ఖూనీలు చెయ్యటం తెలుసూ ?' అతను చింత బరికెతో నా ముఖాన విసిరికొట్టాడు. కళ్లు మూసుకున్నాను. ముక్కుకు తగిలింది. స్థాన బలిమి అంటే ఏమిటో తెలిసినట్లనిపించిది నా తెల్ల చొక్కా, ధోవతీ నన్ను వెక్కిరిస్తున్నాయి. ఈ ప్రపంచాన్ని ఇకముందు చూడకుండా నా కళ్లు రెండూ ఆ క్షణాన పోతే బాగుండునని పించింది. నా చేతికిందబేడిలు అలాగే వున్నాయి.

'నిజం చెప్పండి...,జరిగిందేమిటో చెప్పండి' అంటూ అతను లేచి వచ్చి కిందబడిన చింత బరికె చేతికంది పుచ్చుకున్నాడు.

'నాకేం తెలియదు...నాకేం తెలియదు బాబో' అంటూ నాతో బాటు వచ్చినతను అసలు దెబ్బలంటూ వంటిమీద పడకుండానే ఏడుపు ప్రారంభించాడు. నా కెంతో ఆశ్చర్యం వేసింది.

'దొంగ ఏడుపులు గూడానా...' అంటూ పోలీసు పెద్ద చింత

బరికెతో దబదబా అతన్ని బాదాడు. అతని ముఖంమీద తగిలిన దెబ్బలు నాకు తగులుతున్నట్లుగానే అనిపించింది. ముఖమంతా ఎర్రటి చారలతో కందిపోయింది. వంటిమీద సంగతి తెలియనేలేదు. అతను ఏడిచి ఏడిచి అలసి కింద కూలబడ్డాడు. పోలీసు పెద్ద అతన్ని కాలితో ఒక్క తన్ను తన్ని చింతబరికె కింద పారేసి బయటకుపోతూ 'నిజం చెప్పు నువ్వైనా...లేకపోతే నీ గతీ ఇంతే' అన్నాడు. బయటకుపోతూ పోలీసు జవాన్ను ఉద్దేశించి 'వెధవలను చితకబొడవండి...ముక్కలుచేసి కాకులకూ, గద్దలకూ వేసినా పాపం వుందనా...బాగా కొట్టండి...అన్నీ బయటకు వస్తాయి...యూ బీట్ దెమ్ ఐ సే...' అంటూ బూట్లు చప్పుడు టకటకా చేసుకుంటూ బయటకు నడిచిపోయాడు. ఆ బూట్లకింద మానవత్వం నలిగిపోతున్నట్లనిపించింది.

ఇప్పుడు నేను తిన్న దెబ్బలగురించి చెప్పి ఉపయోగం ఏమీలేదు నాతోపాటు వచ్చి నతనికి ఎన్ని దెబ్బలు తగిలాయో, నాకూ అన్ని తగిలాయి. అన్నం తినటానికి బదులు ఈ దెబ్బలు తిని మా గదులు చేరుకున్నాం మళ్ళీ.

ఆది ప్రారంభ దశ. ఆ రోజంతా ఒక్క మెతుకుగూడా అందలేదు. ఎదురు గదిలో అతను సోలిపోయి పడుకొనడం కనిపిస్తోంది నాకు. మా స్థితుల్లో వ్యత్యాసం లేదు. కింద పడుకునేందుకుగూడా ఎటువంటి వసతి లేదు. ఆచ్ఛాదన పైన ఉందన్నమాట గాని, నేలమీద దుర్భరంగా వుంది. బూట్ల మట్టి, సిగరెట్టు ముక్కలు, ఖాళీ నిప్పుపెట్టెలు ఆ మట్టిలో పడుకోలే ననిపించింది. వంటిమీద, కడుపులోనూ అప్పుడున్న ఆందోళనకు కనీసం ఏ సరస్సు వడ్డునన్నా ఎత్తయిన పచ్చిక బయలుమీద పడుకుని, పక్కనుండే చెటమీదనుండి వచ్చే చలటిగాలిని పీలిస్తే కొంచెం నిద

పడుతుందేమో ? ఆ మట్టిలో కూర్చోలేకపోయాను అసలు. నిలబడే ఓపిక వీసమంతయినా లేదు. కాళ్లు తేలిపోతున్నాయి. కళ్లు చెదురుతున్నాయి. ఎవరిమీదనో పట్టరాని ఆగ్రహం. ఈ పృధ్విమీద బ్రతికే జీవరాశి నంతటినీ హతమార్చి, భూమిని తగలబెట్టేయ్యాలన్నంత ఆగ్రహం పొంగి పొర లింది. మూడు గోడలు, పైన రాతికప్పు. ముందు కటకటాలు. కింద అంతు లేని నేల. అన్నీ నా శత్రువులే. కటకటాలకేసి తల బాదుకుని, బాదుకుని విసుగుచెంది ఎప్పుడు నిద్రపొయ్యానో నాకు తెలియదు. మర్నాడుదయం పోలీసులు బంట్రోతుతో సహావచ్చి తలుపు తీసినప్పుడు చూస్తే అప్పుడే బారెడు పొద్దెక్కివుంది.

నా అలసిన శరీరం చూచేటప్పటికి ఆ బంట్రోతుకి కొంచెం జాలి కలిగినట్లుంది. అయినా విధి నిర్వహణే జీవన ధ్యేయంలా పెట్టుకున్న మనిషిలా కనిపిస్తాడు. 'దొర పిలుస్తున్నాడు...' అన్నాడు. నా కాళ్లమీద నేను నిలబడలేకపోయాను. పోలీసు ఒకతను నన్ను చెయ్యిపట్టుకుని లేవ దీశాడు. అంటే ఒక్క గుంజు గుంజాడు అన్నమాట. రాబోయే అనర్థాల పరిణామాలన్నీ సూచనప్రాయంగా నా మనస్సుకు గోచరమయినాయి. ఉన్న వోపికను అంతా కూడగట్టుకుని లేచి నిలబడి వెళ్ళాను. కాని వాళ్ళ మధ్య మసలటం — ప్రత్యేకంగా అటువంటి దురదృష్టపు క్షణాల్లో...ఎంత కష్టమో నోటితో చెప్పడం ఎవరితరం కాదు. అనుభవించినవాడికి లీలగా మనస్సుకు తట్టాల్సిందే.

ఆ రోజు పన్నెండు గంటలు కొట్టే సమయంలో అన్నం, పులుసూ, మజ్జిగా ఇచ్చారు. అంతా ఆకులో కలిపి పెట్టారు. ఎవరినీ నిందించి లాభం లేదు. ఎవరికీ అభ్యర్థనలు పంపి లాభంలేదు. నేను ఎటువంటి పరిస్థితిలో

వచ్చానో నాకు తెలుసు. కళ్ళు మూసుకుని ఊరుకోవటమే ఉత్తమమైన పని అనిపించింది.

అన్నం నిండా రాళ్ళు. మిగతా పదార్థాలుగూడా అంతంత మాత్రం గానే ఉన్నాయి. ఏమాత్రం హితవుగాలేదు. అయినా అప్పుడున్న ఆకలిలో రుచి పట్టించుకోలేదు. ఆకుమీద ఒక్క మెతుకులేకుండా తినేశాను. ఈ సంగతులన్నీ బయటివాళ్లెవరికన్నా చెప్పుకునే అవకాశం లభిస్తుందా అని ఎంతగానో బాధపడ్డాను. వాళ్ళు ఆహార మిచ్చింది నామీద ప్రేమతోగాదని తెలుసు. అయినా దానవసరం నాకు చాలా ఎక్కువగా కనిపించింది. అప్పుడే ఇంకోమాటగూడా అనిపించింది. నాకు అన్నం పెట్టింది నన్ను కొట్టే దెబ్బలకు నేను నిలబడి వుండగలగటానికేమోననే ఆలోచన నన్ను బాగా కలచివేసింది.

దెబ్బలూ, సాక్ష్యాలూ, అబద్ధాలూ, బూట్ల చప్పుడూ, హితవుకాని ఆహారం, వసతిలేని నిద్ర...అంతా సమకూడి నిరర్థకమైన బ్రతుకయి పోయింది నాది. ఎన్నో జరిగినాయి. నన్ను కొట్టిన దెబ్బలకు సాక్ష్యం లేదు. బయటివాళ్ళతో ఎవరితోనయినా చెప్పుకుందామనుకున్నా సావ కాశం లేదు. పోలీసు పెద్ద ఒకరోజున దెబ్బలు కొట్టి హుంకరించి వెళ్ళి పోయిననాడే నాలో బాధలు బయటకు చెప్పుకునే ఆఖరి అవకాశంగూడా అంతరించిపోయిందనుకున్నాను.

నాతోబాటు వచ్చినతను పిరికి. దెబ్బలు తగిలినప్పుడు నేరం ఒప్పు కునేవాడు. మిగిలిన సమయాల్లో పెద్దపెట్టున ఏడుస్తూ నాకేం తెలియదని గొల్లుమనేవాడు. అతనిదీ ఖూనీకేసు సందర్భమే. వాళ్ళది గుడివాడ దగ్గర ఓ పల్లెటూరు. అతని వాలకాన్నిబట్టి, మాటల ధోరణినిబట్టి కూలిచేసి

బ్రతుకుతుండేవాడనుకుంటాను ఏ తగాదాలో ఇరుక్కున్నాడో, నిజంగా దొంగతనానికి సిద్ధపడ్డాడో భగవంతునికే తెలియాలి. అతనికి తెలియాలి. దొంగతనానికని వచ్చి ఎవరో అలికిడయి లేస్తే గడ్డపలుగుతో తల మోది చంపాడట. నిజంగా ఘోరంగానే కనిపించవచ్చు. నాకు మామూలుగానే తోచింది. అతని ప్రవర్తన ఇంకోరకంగా వుంది. అందులో ఆశ్చర్యపడ వలసింది ఏదీ లేదనుకున్నాను. అది అతనిమీద అభియోగం అతన్ని ఎన్ని రకాలుగా హింసించారో వర్ణనాతీతం.

అంతయినా అతను హత్యానేరం అంగీకరించలేదు.

నా విషయం అంతా వేరు. దెబ్బలయితే తగిలాయిగాని నిజాన్ని దాచలేదు. నా కడుపులో నిజం దాక్కునే చోటు లేదనిపించింది నాకు. వచ్చిన మొదట్లోనే కేసు తీసుకుంటున్న ఒక రోజున పోలీసు అధికారి ఒకతను ఎన్నో ప్రశ్నలడిగాడు. అన్నీ చెప్పాను. ఒక్కమాట దాచలేదు.

'నువ్వు రామదాసును చంపిన మాట నిజమేనా?' అని అడిగాడు అతను.

'చంపాలని నా ఉద్దేశంకాదు...' అన్నాను నేను.

ఏ రకమయిన నిజాలు, అబద్ధాలు, కల్పనలు న్యాయశాస్త్రపు పిడి కిలినుంచి బయటకు జారిపోయే అవకాశాలుంటాయో నాకు తెలియదు. నేను చదివిన చదువులో వాటి ప్రసక్తి లేదు. జరిగింది జరిగినట్లు చెబితే నా పాపానికి – పాపం అనేది నా చేతుల్లో జరిగితే – పశ్చాత్తాపం కలుగుతుం దని, పాపరాహిత్యం అవుతుందనీ అనుకున్నాను. అందుకే అన్నీ చెప్పాను.

నా ఆర్థికస్థితి, మా తమ్ముడు మందులు లేక మంచంమీద ఎలా

గిలగిలలాడుతున్నదీ, వాడికి మందుల ఆవశ్యకతనుగురించి దుకాణం రామదాసు మందులు దగ్గరుంచుకొని అప్పు యివ్వని సంగతీ. . , అన్నీ చెప్పాను. తమ్ముడు మరణశయ్యమీద ఉన్నాడు. మందులు దుకాణంలో ఉన్నాయి. ఆ మందు కనిపెట్టిన శాస్త్రజ్ఞుని ధ్యేయం, దృక్పథం జబ్బును జయించటం. మందుకూ, రోగానికీ పోరాటం మానవ సౌభాగ్యం అతని ఆకాంక్ష. అతను కనిపెట్టిన మందు ఎదురుగా వుండగా, దానికి సంబంధించిన సుస్తి నిలువు నా ఒకరి ప్రాణాన్ని హరిస్తుంటే ఆ శాస్త్రజ్ఞుని ఆత్మ ఎంత క్షోభించి వుంటుంది ? ఆ బాధే నాదీను. ఇంకోరూపంగా వుంది. అంతే వ్యత్యాసం. నా బాధ ఎవరితో చెప్పుకోను. రామదాసు చెవుల్లోకి నా మాటలు దూరలేదు. కాలాన్ని ఎవరూ ఆపలేరు. సూర్యుడు ఉదయించకుండా చేయగలిగేశక్తి ఎవరికుంది ? మందు రాలేదు. తమ్ముడుమీద ఎన్నో ఆశలు నాకు. అతనికీ నాకూ పదేళ్ళ వ్యత్యాసం. అమ్మ చచ్చిపోతూ 'తండ్రిగూడా లేనివాడు...జాగ్రత్త...!' అని తన చేతులమీద విశ్వాసం వుంచి వెళ్ళిపోయింది. నా చేతులు వట్టివని అమ్మకు తెలియదు. అతన్ని ఎంతగానో పెద్దవాణ్ణి చేయాలనుకున్నాను. అందుకోసమే నా ప్రాణాన్నంతా ధారపోసయినా తమ్ముడిని ఒక హోదాగల వ్యక్తిగా చేయాలనుకున్నాను. పెద్ద చదువులు — పెద్ద ఉద్యోగం, కారు, బంగళా, బంట్రోతులు — నేనూ ఒక బంట్రోతులాగానే బ్రతికా. తమ్ముడింట్లో గూడా అలాగే వుండిపోగలను అనుకున్నాను. విధి విపరీతాలకు ఎవరూ అడ్డుపెట్టలేరు. ఆ సంగతి ఒకరికి తెలియదని చెప్పడంగాదు. నిజంగా ఒక పరిస్థితి వచ్చిననాడుగాని ఆమాట స్ఫురించదు. దాని విలువ తెలిసిరాదు. దాని విలాసం అనుభవంలోకి జీర్ణించదు.

ఆ తమ్ముడు నా కళ్ళముందర, నా అసమర్థతను వెక్కిరిస్తూ

కళ్ళు మూసేస్తుంటే ఏమి చెయ్యలేనివాడినై దుఃఖించాను. మందులేస్తే బ్రతుకుతాడు అనే ఆవేశం నాలో కలిగింది ఆ క్షణంలోనే. రామదాసును మందుబిళ్లల సీసా ఇవ్వమని బెదిరించాను. ఇవ్వనన్నాడు. అతన్ని చాలా సార్లు అప్పటికే అడగడం అయిపోయింది. నాలో సహనశక్తి నశించి పోయింది. నా తమ్ముడి ప్రాణం ఒక లోభి, దుష్టుడుగా కనిపించిన రామ దాసు ప్రాణంకంటె ఎక్కువ అని నా మనస్సుకు దృఢంగా తోచింది. అక్కడేవున్న కుర్చీ ఎత్తి అతని తల పగిలేటట్టు కొట్టాను. అతను కిందపడిపోయిన తర్వాతకూడా చాలా సేపటివరకు కొట్టుతూనే వున్నాను. అక్కడే పనిచేసే నౌకర్లిద్దరు అలాగే చూస్తూ నిలబడిపోయారు. అదిరిపడి వుంటారు. మందుల సీసా ఎదురుగా కనబడుతూనే వుంది. ఒకటి తీసు కుని ఇంటికి పరుగెత్తాను. దారిలో వస్తువులేవీ కనిపించనేలేదు నాకు. అమ్మ, తమ్ముడు వాళ్ళే దృష్టిలో వున్నారు. ఇంటికిపోయాను, సన్నగా ఏడుపులు వినబడుతున్నాయి. లోపలకు పోవటానికి భయంవేసింది. ఏం చెడుమాటలు వినవలసి వస్తుందోనని. కాలయాపనే అందులో ఉద్దేశ్యం. విషయం ఏం దాగుతుంది — తమ్ముడు అమ్మదగ్గరకు వెళ్ళి పోయాడు. చేతిలో మందుసీసాను విసురున విసిరేశాను. మంచం దగ్గరకు పోయి పట్టెకు తలపెట్టి బాదుకున్నాను. తమ్ముడి కాళ్ళు చల్లగా తాకినాయి. అమ్మ దగ్గరకుపోయి 'చూడమ్మా...నాకు మందులివ్వకుండా నీదగ్గరకు పంపేశాడు' అని చెబుతాడు కాబోలు! అప్పుడు తనేం సమాధానం చెప్పు కోవాలి? ఏం సమాధానం చెప్పాలి? జీవన్మరణ సమస్యకు సమాధానం ఏముంది? వెర్రిచూపులు చూశాను, దేవుడిపటాలు కనపడ్డాయి. దేవుడే వుంటే ఇంత అన్యాయం జరిగితే చూస్తూ వూరుకుంటాడా? దేవుడున్నాడు అనేవాళ్ళంతా దొంగలు! ఏమిటో ఆలోచనలు వెర్రిగా వస్తున్నాయి. మళ్లీ దుకాణం రామదాసు గుర్తువచ్చాడు. నేను కుర్చీతో మోదివచ్చాను. దెబ్బలు

బాగా తగిలినాయో లేదో! మళ్ళీవెళ్ళి అతన్ని హత్యచేసి రావాలి? నా తమ్ముడు చనిపోవడంవలన ఎంతనష్టమో రామదాసులాంటివాళ్ళు బ్రతికి వుండటంవలన అంత నష్టం అనిపించింది. పరిగెత్తుకు పోతూవుంటే పోలీసులు పట్టుకున్నారు. ఆ రోజునే నన్ను జైలుకు పట్టుకుపోయింది—

ఇదంతా పోలీసు అధికారికి చెప్పాను. న్యాయం జరిగేటట్టు చూడమని చెప్పాను. ఆశ్చర్యం వేసింది! నవ్వు వచ్చింది! న్యాయం జరిగేటట్లు చూడాలా? ఏదో దుకాణం పెట్టుకొని వ్యాపారంలో లాభాలుగడించి తనూ, కుటుంబాన్ని గుంభనంగా గడుపుకుందా మనుకున్న రామదాసును హత్య చేసిన తనకు న్యాయం జరగాలా? న్యాయం జరుగుతుందేమోనని ఒక్కసారి భయంవేసింది. నిజం చెప్పడం అంటే అసిధారావ్రతం, హరిశ్చంద్రుడి ఆదర్శకథ, అవి దేవతలు భూమిమీద తిరిగేరోజులు కాబట్టి వాళ్ళంతా వచ్చి హరిశ్చంద్రుడిని రక్షిస్తారు. నన్నెవరు రక్షిస్తారు. ఈ లోకంలోనే ఏమీ చేయలేని నాబోటివాళ్ళకు పరలోకం ప్రసక్తి ఎందుకు?

పోలీసు అధికారికి ఇవన్నీ అక్కర్లేదు. నే నిచ్చిన వాఙ్మూలం ఆమూలాగ్రంగా వ్రాసుకున్నాడు.

నేరం ఒప్పుకున్న తర్వాత శిక్షపడటానికి పెద్ద ఆలస్యం ఏం ఉంటుంది గనక. నాకు జైలు శిక్షపడింది. ఉరిశిక్ష తప్పింది. నేను కొట్టింది చంపాలని కాదు—దెబ్బలతో అతను చచ్చిపోయాడు. న్యాయశాస్త్రంలా ఒక మెళుకువ నన్ను పరలోకానికి పంపకుండా ఇక్కడే ఆపింది. జైలు శిక్షతో సరిపోయింది. నాతోపాటు వచ్చినతని కేసు ముందుగానే విచారణ అయింది. అతను కేసు అంగీకరించ లేదు. హత్యా

నేరానికి తగిన సంపూర్ణమయిన శిక్ష పడిందతనికి. నాకు పధ్నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష అని తెలిసిన నాడే అతన్ని ఉరితేసేశారు. ఆ రోజు అతన్ని కలుసుకుని మాట్లాడుదామనుకున్నాను గాని అటువంటి ఆవకాశమే కలగలేదు. చావు బ్రతుకుల మధ్య వూగిసలాడేవారితో మాట్లాడటానికేం వుంటాయి సంగతులు — ఈ లోకం — పై లోకం — ఈ లోకం గురించి కొద్ది కొద్దిగా తెలుసు. పై లోకం గురించి గూడా తెలిసే రోజులు వస్తాయి. ఒళ్లు ఒక్కసారిగా జలదరించింది.

మంచంలో మరణించి వున్న తమ్ముని, హోరు హోరున నెత్తినోరు బాదుకుంటున్న భార్యను చూస్తే కొమ్మలు లేని ఓ చెట్టుమీద పక్షులు... నాకు మనస్సులో ఆ చిత్రం బాగా ముద్రితమైవుంది. దుకాణం రామదాసు ముఖం గుర్తు వచ్చేది అప్పుడప్పుడు. బట్టతల, చెవులకు దుద్దులు, జరీ ఉత్తరీయం. అందరికీ ఓ పెద్ద మనిషిలాగా కనిపిస్తాడు. నా కళ్లల్లో ఏదో లోపం వుంది. నాకు న్యాయాన్యాయ విచక్షణ చేయగల శక్తి వుందని నా గట్టి నమ్మకం. అతని ముఖం చూస్తుంటే ప్రపంచంలో పాపాలన్నీ అక్కడే తాండవం చేస్తున్నాయా అనిపిస్తుంది. అతడు చచ్చిపోయాడని తెలిసినప్పుడు నాకూ కొంచెం బాధకలిగింది. చచ్చేట్టు కొడదామనే ఉద్దేశ్యంగాని, చంపుదామని నా ఉద్దేశం కాదు. ఆ మందుసీసా భౌతిక విలువ అతనికి ప్రామాణికంగా తెలియ చెయ్యాలనే గాఢవాంఛ నాలో చెలరేగి నప్పుడే అతన్ని మోదాను. అతను చచ్చిపోయినందుకు నాకేం విచారంలేదు. అయినా పాపం! అనిపించింది. అది గూడా నాకు పధ్నాలుగు సంవత్సరాల కఠిన శిక్ష అని తీర్పు వచ్చిననాడు అనిపించింది. నేను పడ్డ తొందర పాటు విషపరిణామం. అయినా, తమ్ముని పోగొట్టుకొన్న తర్వాత ఇంకా ఏంమిగిలిందని నాకు ఈ ప్రపంచంలో!

జైలుకు వెళ్ళే ముందు పెళ్లాం, పిల్లలను చూడాలని అందరిలా గానే నాకూ అనిపించింది. అయినా ఆ కోరిక క్షణకాలంపాటు వుంది. నేనేం ఘనకార్యం చెయ్యగలిగానని నా ముఖం వాళ్ల ముందర చూపించాలి. జైలు దుస్తుల్లో నన్ను చూసి ఎంతగా బాధపడతారు వాళ్లు. ముందర తమ్ముడిని రక్షించుకోలేని దుర్భర దారిద్ర్యంలో వున్నాను. అందుమీదట పెళ్లాం బిడ్డలను సాకటం గూడా వదిలేసి దూరంగా జైలు ఆవరణలో వున్నాను. అందుకనే ఎవరినీ చూడ నక్కరలేదనిపించింది. జైలు వార్డరు అడిగినప్పుడు ఆ మాటే చెప్పాను. నాకూ, బయటి ప్రపంచానికి ఒక్కసారి బంధాలు తెగిపోయినయి. తమ్ముడు మరణించిన రోజునే ఆఖరిసారిగా బయటి ప్రపంచంలో వాళ్లని చూశాను.

ఇప్పుడు నేనొక ఖైదీని. కఠిన శిక్ష ననుభవిస్తున్నాను అనే భావన నాకు చాలా తొందరగానే వంటబట్టింది. ఆ శిక్షపడిన మరునాడే నన్ను అక్కడ నుంచి తీసుకు వెళ్లి పోయారు. చేతికి బేడీలు, దానికి పొడుగాటి గొలుసు. ఇద్దరు పోలీసులు. ముందర వకరు, వెనకాల వకరు అలా బయలుదేరాం.

బెజవాడలో బండీ చాలా ఆలస్యంగా బయలు దేరింది. రాత్రి పదకొండు గంటలయింది. అప్పటిదాకా ప్లాట్‌ఫారం మీదనే వక మూలగా కూర్చున్నాం. పోలీసు లిద్దరూ వంతులు వేసుకుని ప్లాట్‌ఫారంమీద పచార్లుచేస్తూ వచ్చారు. నాకు తిరుగుదామని లేదు. అంతమంది జనం స్వేచ్ఛగా, చేతులకు బేడీలు, పోలీసు కాపలాలేకుండా తిరుగుతుంటే నాలో ఉక్రోషం వచ్చింది. ఒకమాదిరి అసూయగూడా కలిగింది. నన్నెరుగున్న వాళ్ళెవరన్నా కనిపిస్తారేమోనని ఎంతో మనస్సు నొచ్చుకుంది.

అదృష్టవశాత్తూ ఎవరూ కనిపించలేదు. ఎరుగున్నవాళ్ళు ఎవరూ కనిపించకుండా ఉండటమే అదృష్టం అనుకునే దురదృష్టపు ఘడియలవి.

బండి బాగా ఆలస్యంగా వచ్చింది. వచ్చిన తర్వాత గంటసేపటికిగాని బయలుదేరలేదు. క్షణాలు యుగాల్లాగా గడుస్తున్నాయి. నేను మూడో తరగతి పెట్టెలో ఒక మూలగా కూర్చున్నాను. పోలీసు వకడు నా పక్కగానూ, మరొకడు ఎదురుగానూ కూర్చున్నారు. అటు పక్కకు ఇంకెవరూ రావటంలేదు. వచ్చిన వాళ్ళంతా నా ముఖాన్ని చూసి ఏమిటో చీదరించుకుంటున్నట్లు ముఖంపెట్టి రెండో పక్కగా పోయి కూర్చుంటున్నారు. పోలీసుల మౌనం ఎక్కువగా సాగలేదు. ఎంతసేపు వాళ్ళిద్దరే మాట్లాడుకోవటం విసుగెత్తించి ఉండాలి. నాతోగూడా సంభాషణకు దిగాలనే ఉత్కంఠ అతనిలో కనపడింది. నావంక చూస్తూ 'చలెయ్యటంలేదూ...' అన్నాడు. నిజంగా చలిగానే వుంది. కిటికీలో నుంచి చల్లగా గాలి వీస్తోంది. నా పక్కగా రావటానికి ధైర్యం ఓ ముసలి రైతుకు చిక్కింది. గొంగళి కప్పుకున్నాడు. పెద్ద తలపాగా, చేతికర్ర, పొడుగాటి చుట్ట. రైలింజను పొగలాగా గుప్పు గుప్పుమని వస్తోంది. చుట్టపొగ అతను సర్దుకుని కూర్చోవటానికి చాలా అవస్థ పడుతున్నాడు.

'ఏవూరు తీసుకుపోతున్నారేంటి...' అన్నాడతను నా వంక చూస్తూ పోలీసుల నుద్దేశించి.

'రాజమండ్రి తాతా... అగ్గిపెట్టె వుంటె ఇద్దూ... బీడీ కాల్చుకుంటాం...' అన్నాడు ఒక పోలీసు.

తాత నిప్పుపెట్టె తీసి ఇచ్చాడు.

'ఏం కేసేంటి...' అన్నాడు తాత. 'ఖూనీకేసు' తడుముకోకుండా చెప్పాడు పోలీసు.

'ఖూనీ...?' తాత అదిరిపడ్డాడు. 'ఏంటీ... ఖూనీ చేశాడా... ఎవర్ని...'

నా ముఖంవంక తీక్షణంగా చూశాడు తాత. పెట్టెలో అందరి దృష్టి నా మీదనే పడుతోంది. నా వరసలోనే రెండోపక్క కూర్చున్న ఒక తల్లి కొడుకును దగ్గరకు తీసుకుని అతని మెళ్ళో ఆంజనేయస్వామి బంగారు బిళ్ళ కనపడకుండా కొంగులో దాచింది.

'అది సరేగాని... ఈ సంవత్సరం పంటలెల్లా వున్నా యేమిటీ?' అని అడిగాడు పోలీసు. తాత తనమాట విడిచిపెట్టలేదు.

'పంటల కేమొచ్చె... బాగానే ఉన్నాయి. ఖూనీ అంటే ఎలా జరిగింది. ఏమిటీ కథా కమామీషూ...' అన్నాడు తాత. పోలీసు లిద్దరు నా వంక చూచారు. అందులో ఏ భావంలేదు. వెలుతురులేని గదిలో ఉండే అద్దాల్లాగా వున్నాయి ఆ ముఖాలు.

నాకు జరగవలసిన అవమానం జరిగిపోయింది. ఇంక సిగ్గు పడాల్సిందేమీలేదు. గొంతు సవరించుకుని ఏదన్నా అందామనుకున్నాను. మాట పెగల్లేదు.

'ఏంలేదు తాతా... మందుల దుకాణం రామదాసులేడూ... అంటే నీకేం తెలుస్తుందిలే... ఓ రామదాసని... మందులు అమ్ముతాడులే... ఆయన్ని కుర్చీపెట్టి కొట్టాడు ఈయన. దాంతో ఆయన కాస్తా చచ్చిపోయాడు. ఈయనకేమో రాజమండ్రీలో జైలుశిక్ష వేశారు...' పోలీసు టూకీగా చెప్పేశాడు.

తాత చుట్ట పీలుస్తున్నాడు. బండీ బయలుదేరింది. బెజవాడ ప్లాట్‌ఫారం దాటి వూరి పొలిమేరలు దాటేవరకు లైట్లు కనపడుతూనే వున్నాయి. తాత మధ్య మధ్య దగ్గుతున్నాడు.

'తాతా... పంటలు బాగానే ఉన్నాయంటావా... మొన్న వానలకు పంటంతా నేలకరుచుకు పోయిందంటారేమిటి' అని అడిగాడు. తాత సమాధానాలు చెబుతున్నాడు. వాళ్ళ సంభాషణలు పట్టి కొన్ని విషయాలు తేలినాయి. పోలీసులది మాజేరు. అంటే బందరునుంచి నాగాయలంక పోయే బస్సు దారిలో ఉంటుంది వాళ్ళవూరు. అక్కడ వాళ్ళకి పొలాలున్నాయి. పొలాన్ని కవులుకిచ్చి ఇక్కడ పోలీసు నౌకరీలో చేరాడితను. పొలం అంటే ఏమంత తక్కువేంలేదు. రెండెకరాల మాగాణి పొలం. రెండవపంట పండుతుందంటారు గాని దాంట్లోనుంచి గింజలు అతని కెప్పుడూ రాలేదుట. అదీ పోలీసు గోడు. మిగతా ధాన్యం కిందటి సంవత్సరం బకాయి పెట్టాడట. ఈ సంవత్సరంలోనన్నా ఇస్తాడేమో అనుకుంటే పంటంతా పాడయిపోయిందనీ అప్పుడే రైతులు గొడవ ప్రారంభించారు. ఆ పొలం కాస్తా అమ్మేసి బెజవాడలోనే స్థలం కొనుక్కొని పాక ఒకటి వేసుకోవచ్చు అనుకున్నాడు ఆ పోలీసు.

వాళ్ళా పొలం చర్చల్లో మునిగిపోయారు. ఏదో తేల్చేస్తానంటున్నాడు పోలీసు. ఈ సంవత్సరం ఆ లెక్కలేదో తేల్చెయ్యకపోతే ఈసారి వెళ్ళినప్పుడు తుపాకిపెట్టి కాల్చి పారేస్తా నంటున్నాడు. అతని ముఖం కంది గంభీరంగా వుంది. రెండో పోలీసుకు పొలం గురించిన సందర్భం ఏమీ లేనట్లుంది. ఎదురు బల్లమీద కొంచెం వెనక్కువాలి జోగాడుతున్నాడు.

ఎవరో బటానీలు అమ్ముకుంటూ వచ్చాడు. ఒక అణా బటానీలు కొని నా ముందుగూడా కొన్ని పోశాడు. నాకు తినాలని అనిపించలేదు. కాలం గడిచే విధానం అసలే తోచలేదు. వాళ్ళ సంభాషణ వింటూ అలాగే కూర్చున్నాను.

ఆ పోలీసుకు ఇద్దరు ఆడపిల్లలట. పెద్దమ్మాయి పెళ్లీడుకు వచ్చింది. అయినవాళ్ళంతా కట్నంఇస్తే చేసుకుంటామంటున్నారట. మిగతా ధాన్యం పూర్తిగా వస్తే దాన్ని అమ్మేసి కొంత డబ్బు వరకట్నం కింద ఇచ్చు కుందామంటే అది కుదరటంలేదు. ఒక ముసలితల్లి వుందట. పెళ్ళిచూసి చచ్చిపోతానంటుందట. 'చచ్చేవాళ్ళు చావకుండా బ్రతికున్నవాళ్ళ ప్రాణాలు తీస్తారు...' అంటూ ముసలితాత పెద్దపెట్టున దగ్గుతూ నవ్వటం మొదలు పెట్టాడు. అన్నీ సమస్యలు. తనను శిక్షిస్తున్న ఇద్దరు పోలీసులు మామూలు రక్తమాంసాలున్న మనుష్యులుగా నాకాపూట కనిపించారు. బండి సాగిపోతూనేవుంది. వాళ్ళ సంభాషణ అలాగే సాగిపోతోంది.

నా చేతిలో బటానీలు అలాగే వున్నాయి. నా దృష్టి ఒక్కసారిగా ఎదురుగావున్న బల్లకింద పడింది. రెండుకళ్ళు మెరుస్తున్నాయి. ఎవరో బిచ్చగత్తె అయివుండాలి. ముగ్గుబుట్టలాంటి తల. ముడతలుపడ్డ ముఖం, ఆమె ముఖం కొంచెం ముందుగాపెట్టి నా వంక జాలిగా చూసింది. ఆ బటానీలు ఇద్దామనిపించింది. ఆమె ముఖంమీదవున్న గీతలన్నీ ఒక్కొక్కటి ఆమె అనుభవించిన ఒక్కొక్క కష్టానికి సాంకేతికమైన చిహ్నంలా తోచింది. నా చేతికి బేడీలు అలాగే వున్నాయి. ఒకచేతికి సంకెళ్ళు తీసెయ్యమని పోలీసుని కోరాను. అతడు వెంటనే అంగీకరించాడు.

నాకు కునుకు పట్టినట్లయింది. ఆ నిద్రలో ఏం జరుగుతున్నదీ నా కేమీ తెలియటమేలేదు. రైలు కదిలిపోతున్నదన్న ఆలోచనమాత్రం రేఖా మాత్రంగా నా మనస్సుకు కుదుపువలన తట్టుతోంది. ఎవరో టికెట్టు కలెక్టర్ వచ్చినప్పుడు గందరగోళంలో ఉలిక్కిపడి లేచాను. నా దగ్గర వున్న పోలీసు నమస్కారం చేశాడు. అందరి టిక్కెట్లూ పరీక్షిస్తున్నాడు. నన్ను టికెట్టు అడగాలని అతనికి అనిపించలేదు. నావంక చూసే చీద రించుకుంటూ 'దొంగ వెధవ' అంటూ తిట్టటం నాకు స్పష్టంగానే విన పడింది. అవమానంతో క్రుంగిపోతూ ముఖం వేలవేసుకుని అలాగే కూర్చు న్నాను. నా ఎదురుగా బల్లకింద ముసిల్ది కిందకిందకు జరిగిపోతోంది. అతను చూశాడు. బూటుకాలితో తన్నాడు. పెద్దపెట్టున ఏడుస్తోంది ఆ ముసిల్ది. ఆయాసపడుతోంది. అక్కడ కక్కుకుంటుందేమోనన్న భయం వేసింది. ఏమేమిటో బతిమాలుతోంది. పైనపక్కమీద పడుకుంటున్న నడివయస్సు మనిషి కిందకు దిగి వచ్చాడు. టిక్కెట్టు అడిగితే జేబులో చెయ్యిపెట్టి 'నా మనీపర్సు...మనీపర్సు' అంటూ గల్లంతు చెయ్యటం మొదలు పెట్టాడు.

'ఏమయింది?'
'మనీపర్సు పోయింది.'
'ఎప్పుడు పోయింది?'

'ఇందాకగూడా పడుకునేటప్పుడు చూసుకున్నాను. ఈ స్టేషనులో ఎవరయినా కొట్టేసిఉండాలి. టిక్కెట్టుగూడా అందులోనేవుంది.

టిక్కెట్టు కలెక్టర్ తొణకలేదు. మనీపర్సు పోయిందన్న విచారం కొంచెం అన్నా కనపడ్డంలేదు. ఏమీ సంబంధంలేనివాడికి నాకే 'అయ్యో పాపం, అనిపించింది. అతను గగ్గోలు పెటుతున్నాడు.

'పర్సు పోయినట్లు ఏమిటి గుర్తు' అడిగాడు టిక్కెట్టు కలెక్టర్.

'పర్సుపోయి నేను గోల పెట్టుతుంటే నామీద అబద్ధంగూడా కట్టుతున్నారా...కావాలంటే నా జేబు చూడండి పర్సు ఉందేమో...' అన్నాడు అతను. పోలీసు పెద్దపెట్టున విరగబడి నవ్వుతూ 'అసలు పర్సు నీ జేబులోవున్నట్లు గుర్తేమిటి?' అన్నాడు. టిక్కెటు కలెక్టర్ అంతకంటె పెద్ద పెట్టున విరగబడి నవ్వాడు, కొద్దిగా సర్దుకుని అతను.

'మాకవేం తెలియవు' అన్నాడు. ఆ అసామి 'నన్నేం చావమంటారా' అన్నాడు విసురుగా.

'చావవద్దు – పెట్టవద్దు – పైకిపోయి పడుకోవయ్యా –' అన్నాడు టిక్కెట్ కలెక్టర్. ఇంకెవరిదగ్గరో టిక్కెట్టు లేదు. నాలుగురూపాయల పావలా జరిమానా కట్టమంటున్నాడు. అతనో అర్ధరూపాయ చేతిలోపెట్టి 'పుణ్యం వుంటుంది' అని టిక్కెట్టు కలెక్టరుని సాగనంపాడు.

ప్రక్క స్టేషను వచ్చేదాకా పోలీసులు, అతను ఎన్నోవిషయాలు మాట్లాడుకున్నారు. మారుతున్న కాలం, అరికట్టలేని అన్యాయాలు, కాలం ఏవిధంగా పాడైపోతున్నదీ, ప్రపంచాన్ని ఏరీతిగా ఉద్ధరించాల్సిందీ, అసలు శాంతి అంటే ఏమిటో, అది ఎటువంటి పరిస్థితుల్లో ఒనగూడుతుందో...అన్నీ చర్చ జరుగుతున్నాయి. మరీ లంచగొండితనం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ బాగా పెరిగిపోయిందట. అదే అసలు దేశానికి అరిష్టమన్నాడు టిక్కెట్ కలెక్టర్. పోలీసు తలవూపాడు.

'అసలు కాలేజీల్లో సంగతి అధ్వాన్నంగా వుందంటే నమ్మండి... పరిచయాలు, రికమెండేషన్లు పనిచేసినంతగా ఇంకేవీ పనిచెయ్యవు. మా

అబ్బాయికి యం.బి.బి.యస్.లో సీటుకోసం ఎంత తాపత్రయపడ్డానని — మా పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుద్వారా చెప్పించినా ఏమీ ఉపయోగ పడలేదు. ఆఖరికి బి.ఎస్.సి.లో చేర్పించాను. ధూ — వెధవ చదువులూ వెధవ వుద్యోగాలూనూ' అని తుబుక్కున క్రింద ఉమ్మేశాడు. బల్లకింద ముసిల్ది అలాగే వణుకుతూ నిలబడింది. బండి ఆగటంతోటే ముసిలిదాన్ని దింపేశాడు. బయటకు తీసుకుపోయాడు ఆ చలిలో. పెట్టెలోవాళ్ళంతా ఆ ముసలిదానిమీద సానుభూతివర్షం కురిపించారు.

"పాపం...ఈ రాత్రి ఎలా వుంటుంది ఈ చలిలో"

'రేపయినామటుకు ఎలా వస్తుంది...' అలాంటి సానుభూతి వాక్యాలు సర్వదా వచ్చినాయి.

బండి బయలుదేరింది. కిటికీలోనుంచి బయటకు చూశాను. కట కటాల దగ్గర నిలబడ్డ ముసల్ది పరుగులెత్తుకుంటూ బండి దగ్గరకు వచ్చి నడుస్తున్న రైలులోకి ఎక్కింది నవ్వుకుంటూ.

"అసాధ్యురాలుగానే వుంది..." అన్నా డొకడు. నవ్వి వూరు కుంది ముసల్ది పొగాకుపాయ ఒకటి తుంచి నోట్లో వేసుకుని నములుతూ.

'ఎట్లా వచ్చేశావు...' అని అడిగాడతనే. 'పేద వాళ్ళం... ఎట్లా చావం చెప్పు బాబూ. బేడ డబ్బులు చేతిలో పెట్టి వచ్చాను...' అంది.

'ఎక్కడికి పోతున్నావు...' అడిగా డతను.

'కూతురు పురుడు పోయటానికి నాయనా...' అంది ముసల్ది. ఆ రెండు మాటలూ అబద్ధాలుగా తోచినాయి. ఆయాసపడటం, దగ్గటం

చూస్తే ఇందాక రోగిష్టి మనిషనిపించింది గాని ఇప్పుడు నింపాదిగా కూర్చుని పొగాకు నములుతుంటే నాకాశ్చర్యం వేసింది. అనుభవానికి హద్దుల్లేవు. ఆలోచనలకు అవధుల్లేవు.

కునుకు పట్టేటట్టుగా వుంటే కొంచెం వెనక్కు జరిగి వాలాను. నా చేతికున్న గొలుసు పక్కనేవున్న పోలీసు తన చేతికి గట్టిగా ముడివేసుకున్నాడు. అతనికీ కునికిపాట్లు వస్తున్నాయి. నా ముందు కూర్చున్న పోలీసు అప్పుడే గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. వాళ్ళు నాకు కాపలా వుంటున్నారా నేను వాళ్ళకి కాపలా వుంటున్నానా? అని సందేహం నాలో కలిగింది. రెంటికీ వ్యత్యాసంలేదు. మేం ఇద్దరం జైలుశిక్ష అనుభవిస్తున్నట్లు లెక్క.

నాకు వెంటనే నిద్ర పట్టింది.

రాజమండ్రి జైలులో నన్ను చేర్చిన తర్వాత ఎన్నో మార్పులు చకచకా వచ్చినాయి. కఠిన శిక్ష అనుభవించటం అంటే నిజమైన రూపం తెలిసింది. శిక్ష అంత కఠినంగా లేదు గాని అక్కడి వాతావరణం దుర్భరంగా వుండ. నా లాగా శిక్ష అనుభవించటానికి వచ్చిన వాళ్ళు, అప్పటికే అనుభవిస్తున్న వాళ్ళు అనేకులు కలిశారు. నేను అక్కడికి వెళ్ళిన మొదటిరోజునే ఒకఖైదీ కనపడి 'ఎవరిని ఖూనీచేసి వచ్చావు తమ్ముడూ...' అన్నాడు. నా వళ్ళు జలదరించింది నా తమ్ముని బ్రతికించుకోలేని నికృష్టపు వాతావరణంలో పెరిగాను. నా తమ్ముడినే ఖూనీ చేసుకున్నాను. ఆ మాటే చెప్పాను.

'నా తమ్ముడిని ఖూనీ చేశాను... ఈ శిక్ష అందుకు కాదు నాకు పడింది. ఈ శిక్షే అందుకయితే ఎంతో సంతోషించేవాడిని. అదికాకుండా

ఒక చీడపురుగులాంటి వ్యక్తిని కొట్టినందుకు వచ్చింది శిక్ష. అందుకు నాకీ బాధ...' అన్నాను అతనితో.

'చీడ పురుగుల్ని చంపితే శిక్ష ఏమిటి తమ్ముడూ' అన్నాడతను. పక్కనున్న వాళ్ళు నవ్వుతున్నారు. నేనూ ఒక ఖూనీకోరునయిపోయాను. బింకంగా వున్న నా ముఖం చూసి వాళ్ళంతా పగలబడి నవ్వుతున్నారు. కాని నన్ను ప్రశ్నించినతనికి నామీద ప్రేమ కలిగిందో, జాలి కలిగిందో, నా అసహాయతకు సానుభూతి కలిగిందో నవ్వలేదు. అతని ధోరణి చూస్తే నాకు మరీ ఆగ్రహం చిందులుతొక్కింది.

'దయ్యాల్లాగా అలా నవ్వుతున్నారెందుకు... పది రూపాయల మందుసీసా అప్పివ్వమంటే ఇవ్వకూడదేం...' అంటూ అరిచాను.

'ఎవరు అప్పివ్వలేదంటావు...' అడిగాడు అతను.

'వాడే... ఆ దుకాణంవాడు...' అని అంతకంటె బిగ్గరగా అరిచాను.

'దుకాణాలు పెట్టుకున్నది అప్పు లివ్వటానికీ... దివాలా తీయటానికా తమ్ముడూ' అన్నా డతను నింపాదిగా. నా గుండె ఒక్కసారి ఆగినట్లయింది. వళ్ళంతా వేడెక్కిపోయింది.

'మరి నా తమ్ముడు చచ్చిపోవటంలా... నా సంగతి ఎవరు చూస్తారు ?' గొంతు చించుకుని పిడికిలి బిగించి చూపిస్తూ అరిచాను.

'ఎవరిమీద నీ కోపం తమ్ముడూ... మందులతోనూ వైద్యాలతోనూ చచ్చేవాళ్ళు బ్రతుకుతారనుకుంటున్నావా... చావటానికి మందు

లున్నాయిగాని ఎక్కడన్నా బ్రతకటానికి మందులుంటాయా తమ్ముడూ...' అన్నా డతను. 'హు' అంటూ హుంకరించాను. అక్కడున్న మరికొద్ది మంది పిడికిలిబిగించి నన్నుచూసి నవ్వుతూ హుంకరించారు. అక్కడంతా ఖూనీకోరులే. ఎవరిని ఎవరు బెదిరించీ వుపయోగంలేదు.

అతన్నేదో ప్రశ్న అడుగుదామనుకుంటుండగా జైలరు వస్తున్నా డని తెలిసింది. ఎక్కడివాళ్ళం అక్కడకు పక్కకుపోయి నిలబడ్డాం.

'ఏం చేస్తున్నారు...' అధికార హోదా ఉట్టిపడేటట్లు అడిగాడు. ఎవరూ సమాధానం చెప్పలేరు. అతనితోపాటు వచ్చినతను అందరిపేర్లు ఆ వార్డులో వున్నవాళ్ళని – పిలిచి హాజరు తీసుకున్నాడు. జైలరు టక టకా బూట్ల చప్పుడు చేసుకుంటూ మా మధ్యనుంచి అటూ ఇటూ తిరిగి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళినవంకనే చూస్తూ నిలబడ్డాను.

నాతో మర్యాదగా మాట్లాడిన ఖైదీ మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు.

'మీ దేవూరు...? అని అడిగాను. 'దొంగా మనిషేట' అని చిన్నప్పుడు మా అమ్మావాళ్ళు అనుకుంటుంటే ఆశ్చర్యంగా చెవు లప్పగించుకుని వింటుండేవాడిని. వాళ్ళు ఎప్పుడూ దొంగను చూచి వుండలేదు. ఎదుటి వాడి సొమ్ము అర్ధరాత్రి కన్నంవేసి తీసుకు పోయేవాడు దొంగ. వాడు మనిషిగాదు. మనుష్యులు, దేవతలు, జంతు వులు వున్నట్లుగానే దొంగ అనేది ఒకసృష్టి విశేషం. అతను నల్లగా వుంటాడు. పెద్ద పెద్ద మీసాలుంటాయి. కళ్ళకు గంతలుంటాయి. ముఖం భయంకరంగా వుంటుంది. అర్ధరాత్రుళ్ళు తిరుగుతాడు. చినిగిన బట్టలు కడతాడు. అదొక దేవుని శాపం. అన్నీ తెలిసేవిగాని అతను అర్ధరాత్రుల్లే ఎందుకు తిరుగుతాడో, చినిగిన బట్టలే ఎందుకు కట్టతాడో నాకు అదివరలో ఎంతమాత్రం తెలిసేది గాదు. చినిగిన బట్టలలోని

ముక్కలయిపోయిన సాంఘిక సత్యం తెలిసేదిగాదు. చీకటి జీవితం లోని చికాకు, వేదన అర్థమయ్యేది గాదు. అతనూ మనిషేట ! అని అమ్మ అంటుంటే ఎలా వుంటాడో చూద్దామనిపించేది ఆ రోజుల్లో. ఇప్పుడు తెలిసింది. ప్రతి దురాగతానికి వెనుక మింగుడు పడని సత్యం ఏదో వుంది. అది ఏమిటి. దానికి విరుగుడు ఏమిటి ? ఈ ఆలోచనలు నాకు రావటం ఎంతో ఆశ్చర్యం వేసింది. ఈ విచక్షణాజ్ఞానం రామదాసును కొట్టబొయ్యేముందు ఒకక్షణం దర్శనమిస్తే నా జీవిత విధానంలో ఈ మార్పు వచ్చేది కాదేమో ! డబ్బు పీడించుకునే రామదాసులాగా కనపడ్డ ఆ దుకాణంవాడు, వాళ్ళ కుటుంబ భారాన్ని మోస్తూ శ్రమిస్తున్న ఒక జీవిగా నాకు కనపడితే, నాకు అర్థమయితే ఎంత బాగుండును ? అనిపించింది నాకు.

'మీదేవూరు ?' అతన్నడిగిన ప్రశ్నకు సమాధానంగా 'కాకినాడ' అని చెప్పాడతను. ఎందుకోసం ఈ శిక్ష పడిందని మామూలుగా అయితే అడిగేవాడినే గాని ఇప్పుడా స్థితి మారింది. ఏదో గాథ చెబుతాడు. బాధపడేవాళ్లు, సుఖపడేవాళ్లు, కష్టపడకుండా సుఖపడేవాళ్లంతా దొంగలు. అందుకని బాధపడేవాళ్లంతా సుఖపడే వాళ్లని హతమార్చాలి. అప్పుడు బాధపడేవాళ్లు సుఖపడవచ్చు. అది ఎంత దాకా ? మళ్లీ బాధపడేవాళ్లు వచ్చేటంతవరకూ!

అతనేదో చెపుదామనుకుంటున్నాడు. నాకు విందామని లేదు. జైలు గోడలు, కటకటాలు దాటి చల్లని గాలి వస్తోంది. ఎండ మెల్లగా జైలు గోడమీదికి పాకుతోంది. గాలికి, వెలుతురుకి అడ్డు పెట్టలేరు ఎవరు. సూర్యుని ఎండ ఇక్కడ గూడా వస్తూందన్న మాట. 'ఊహూ' అనుకుంటూ నా పనిలో నిమగ్నమయిపోయాను.

పని అంటే ఏమీలేదు. మాకు ఎటువంటి పని అప్పచెప్పాలో ఇంకా నిర్ణయం కాలేదు. అప్పటిదాకా తోటపని చెయ్యమన్నారు. కుదుర్లు తవ్వటం, మళ్లు చెయ్యటం,నీళ్లు పట్టటం. ఒకో్కసారి అంట్లు తొక్కాలసి వచ్చేది. పలుగు, పార ఇప్పుడు నా చేతిలో కలం కాగితాలమాదిరిగా తిరుగుతున్నాయి. చేతిలో కాయలు కాసినాయి. మొద్దుబారినాయి. సున్నిత మైన నా చేతులు ఇప్పుడు ఏ పనికైనా తయారుగా వున్నాయి. అప్పు డప్పుడు చెట్లుకొట్టి వెయ్యవలసి వచ్చేది.

వేళకి తిండి, వేళకు పని, వేళకునిద్ర...అన్నీ జైలు గంటప్రకారం నియమంగా జరిగిపోతున్నాయి. అదీ ఒకరకంగా బాగానే వుంది. ఆహారం సరియైనది వుంటే ఆ జీవితం సౌఖ్యంగానే వుంటుందేమో ! మూకుడులో అన్నంపెట్టేవాళ్లు. తాగటానికి పాలడబ్బీ సీనారేకుది ఇచ్చేవాళ్ళు. కొద్ది రోజుల్లోనే అలవాటయిపోయింది. అయినా ప్రతిరోజు అన్నానికి కూర్చు నేముందు కళ్లల్లో నీళ్ళు తొంగి చూచేవి. మూకుడు, సీనారేకూ డబ్బా— వీటిని చూస్తుంటే అప్పుడే కోసుకొచ్చిన అరిటాకు, తోమిన రాగి పంచ పాత్ర గుర్తుకు వచ్చేవి. 'ఇంకొంచెం తినండి' అనిబ్రతిమాలి పెట్టేవాళ్లె వరుంటారు. కన్న కొడుకును ఒళ్లో కూర్చోపెట్టుకునీ, భార్యబలవంతం చేస్తుంటే చమత్కారంగా మాట్లాడుతూ తిన్నట్లు అక్కడ ఎట్లా వుంటుంది. జైలు జీవితం, నా జీవితంకంటే ముందే అంతమయి భార్యా బిడ్డలను మళ్లీ కలుసుకోగలుగుతానా' అని ప్రతి రోజూ అన్నంతినే ముం దట ఆలోచిస్తుండేవాడిని. అన్నం, కూరా. పులుసూ, మజ్జిగా అన్నీ వరసాగా టైము ప్రకారం వడ్డించి వెళ్లిపోతారు. గబగబా అన్నం తినేసి మెతుకులు ఎత్తుకుని మూకుడు వాటిని కడిగేసుకుని మా జైలు గదిలో దాచు కోవాలి. అదే నాకు ఇల్లు. సర్వస్వమూనూ.

రోజులు దొర్లుకుపోతుంటే నెలలు మారు తున్నాయి. మమ్మల్ని పనికోసమని మళ్ళా బెజవాడ తీసుకు వచ్చారు. అంతా కలిసి నలభై మంది ఉన్నాం. కృష్ణానదికి రెగ్యులేటరు బ్రిడ్జి కడుతున్నారు. అక్కడికి అతి సమీపంలోనే ఉన్న కొండమీది రాయి కొట్టాలి. సుత్తి ఒకటి ఇచ్చారు అందరికీ. కొండపైకి ఎక్కుతుంటే స్వర్గారోహణలాగా అనిపించేది. కుప్పలు, పొదలు అంతాను. పైకి పోవటనికి కొంచెం మెట్లు లాగా చేశారు అంతకుముందే. రాయికొట్టేచోట విశాలంగానే వుంది. అక్కడినుంచి చూస్తుంటే వూరంతా కనపడుతుంది. దుర్గగుడి, అక్కడక్కడ పొగగొట్టాలు, బొమ్మరిళ్లలాగా కనపడే భవంతులు కాస్త కొండ మీదకుపోయి చూస్తేనే బెజవాడవంటి మహాపట్టణం అంతా కలిపి ఓ చిన్న పల్లెలాగా, బొమ్మరిళ్ల బల్లలాగా కనిపిస్తుంటే ఇంకా, ఇంకా ఎత్తుకుపోతే ఈ పట్టణం, జిల్లా, దేశం ఖండం...అన్నీ ఒకొక్కటే చిన్నవైపోయి భూమి అంతా కలిపి చిన్న బంతిలా అయిపోతే...మానవుని అస్తిత్వం ఏమిటి ? విశాలమైన విశ్వాంతరాళంలో భూమి ఒక పరమాణువు. ఛేదించటానికి వీలు లేదనుకున్న అణువులాంటిది భూమి. అయితే అందులో ఒక మనిషి అస్తిత్వమేమిటి ? అతని పరిమాణ మెంత ? భగవంతుని సృష్టిలో ఈ సృష్టి విశేషం యొక్క స్థాన మెంత ? ఎంతో ఆశ్చర్యం! వళ్ళు జల్లుమంది. కోటానుకోట్ల సంవత్సరాలనుంచి ఈ సృష్టి సాగిపోతోంది. ముందు గూడా అనంతంగా ఇలాగే సాగిపోతుంది. కొలవటానికి కాలమానమే లేని ఈ పొడుగాటి జీవిత ప్రవాహంలో ఒక మనిషి జీవిత ప్రమాణం—ఓ వందేళ్ళు ఎంత ? కృష్ణానదీ ప్రవాహంలో ఒక నీటిబొట్టు పరిమాణం అన్నమాట. నాకు భయంవేసింది. మానవుని ఉనికి ఇంత కుంచించుకు పోయిందా? భగవంతుని సృష్టిలో మానవుని జీవనానికి ఇంతఅల్పమైన స్థానంవుందా? ఎందుకీ విద్వేషాలు. వైషమ్యాలు...

ఎందుకీ స్పర్థలు, కచ్చలు, దొంగతనాలు, ఖూనీలు... దేన్ని గురించి, మనిషి నిలువునా అగ్నిలో దహించుకుపోతుంటే, కాలిమీద ఎక్కడో దురదగా వుందని బాధపడి ఏం ప్రయోజనం? విశ్వకర్త ముందు మనిషి ఎంత? ఆ సృష్టి విశేషాలను సంభ్రమాశ్చర్యాలతో పరికిస్తూ ఏ సెలయేటి ఒడ్డునో తపస్సు చేసుకుంటే బాగుండును... ఇలాంటివి ఎన్నో ఆలోచనలు నా మనస్సులో కలవరంగా తిరగసాగినాయి. కొండ మీదనుంచి కింద పడిపోతానేమో అనిపించింది. నా కాళ్లకింద భూమి తొలగిపోతున్నట్లనిపించింది. కళ్ళు తిరిగి పడి పోయాను.

నాకు స్పృహ బాగా వచ్చేటప్పటికి రాజమండ్రీనుంచి వచ్చిన నా స్నేహితుడు - తోడి ఖైదీ - నా పక్కన వున్నాడు. అతని కంటిలో మెర మెర కనిపించింది నాకు 'ఎట్లావుంది?' అని అడిగాడు.

'బాగానే వుంది... మంచినీళ్ళు కావాలి నాకు... ఇప్పుడు టైమెం తయింది?' అని అడిగాను.

'పొద్దు కూకుతోంది. అలా పడిపోయావేం?' అని అడిగాడు. అప్పుడే తెల్లవారుతున్నట్టుగా అనిపించింది నాకు 'కళ్ళు తిరిగినాయి ' అన్నాను.

'ఎప్పుడూ కొండ లెక్కలేదా...?' ప్రశ్నించాడతను.

'ఊఁ...' అన్నాను మనుషులను ఖూనీ చెయ్యటానికి వెనుదీయని మాకు కొండలెక్కితే కళ్ళు తిరగటమా. గుండె అంత గట్టిగానూ, మెత్తగానూ వుంటుది కాబోలు. పొలం తగాదాల్లో గట్లమీద తమ్ముడిని కర్రతోమోది చంపిన వ్యక్తి కళ్ళవెంబడి నీళ్ళు కారుస్తున్నాడు.

'ఏడవకు...మనం నిజంగా ఏడవటానికి ఈ కన్నీళ్ళు చాలవు...?' అన్నాను. అతను కళ్ళు తుడుచుకు వెళ్లి పోయాడు. పాపం! ఇంట్లో వాళ్లెవరో గుర్తు వచ్చి వుంటారు.

పని చురుకుగానే సాగిపోతోంది. రాళ్ళు కొట్టటం బాగానే అలవా టయిపోయింది. లారీల్లో రాయి, మోసుకుని పోతూ వుంటారు. కూలీలు, డ్రైవర్లు క్లీనరు...అందరితో పరిచయం అవుతోంది అప్పుడప్పుడూ. మా పక్కనే జైలు ఉద్యోగి ఒక కంటకనిపెట్టి తిరుగుతూనే వుంటాడు పొద్దున, సాయంత్రం హాజరు వేసుకోవటం అటుంచి, మాకు ఇంకో బాధ్యతగూడా ఉంది. ఆయిదేసుగురం కలిసి ఒక జట్టు. ఆ జట్టులో వాళ్ళు పారిపోవటం లేదని అందులో ఒకతను బాధ్యతతో చూసుకుంటూ ఉండాలి. మాలిమి అయిన ఏనుగులను కొత్తగా అడవిలో ఏనుగులను పట్టటానికి ఉపయోగిస్తారట. జైలులో నాలుగేళ్లు శిక్ష అనుభవించి సత్ప్రవర్తన కలవాడు అనుకున్నవాడికే ఆ పని అప్పగిస్తారు. నన్ను చూచేవ్యక్తి మధ్యమధ్య 'ఏం చేస్తున్నావు?' అని అడిగి పోతూఉంటాడు. సమాధానం అక్కర్లేదు. చూచి వెళ్ళిపోతాడు, అంతే.

అక్కడ పని బాగానే వుంది. మా మకాం అక్కడే వేసుకున్న గుడారాల్లో. మా జైలు ఉద్యోగికూడా అక్కడే పడుకుంటాడు. అతని చేతికింద ముగ్గురు పోలీసులు ఎప్పుడూ వుంటారు. వాళ్ళదగ్గరా తుపాకు లున్నాయి. ఎప్పుడూ ఉపయోగించిన పాపాన పోలేదు. ఎప్పుడూ భుజాన వేసుకు తిరుగుతూ వుంటారు. వాళ్ళు చేసే పనిగూడా ఎక్కు వగా కనిపించలేదు. మా మధ్య తిరుగుతూ వుంటారు. వాళ్ళు పనుల్లో ముఖ్యమైనవి ఏమిటంటే... పొద్దున్నే లేవగానే జైలు అధికారికి వేడినీళ్ళు

పెట్టి ఇవ్వటం, బూట్లు పాలిష్ చెయ్యటం... పగలల్లా తిరగటం, సాయంత్రం అధికారికి పక్క ఏర్పాటు చెయ్యటం. వాళ్ళ స్వంతపనులు వాళ్ళు చూసుకోనక్కరలేదు. పోలీసుల బూట్లకు పాలీషు మాలో ఎవరన్నా చేసి పెట్టుతూ వుండేవాళ్ళం. భోజనానికి మాతోపాటే వస్తుండేవాళ్ళు కొంచెం ముందు వెనుకగా. సాయంత్రంపూట ఒకటి రెండుసార్లు పనయిపోయిన తర్వాత కొండమీద తిరుగుతూ అక్కడపోయే కొంగలను తుపాకి పెట్టి కాలుస్తుండేవాళ్ళు. వాళ్ళ గురి తగిలి ఏ కొంగా పడేదిగాదు. ఆ ధ్వని కొండలమధ్య ప్రతిధ్వనిస్తూ బయ్, బయ్మంటూ వినపడుతుండేది. ఒకరోజు కాబోలు రోజులు నిండిన వక కొంగకు తుపాకీదెబ్బ తగిలి పడిపోయింది. ఆ రాత్రే దాన్ని వండి జైలు అధికారికి పెట్టారు. ఆ కొంగ గిలగిల తన్నుకుని కింద పడిపోతుంటే నాప్రాణం విలవిలలాడింది. మిగతా కొంగలన్నీ ఎక్కడి వక్కడ పారిపోయినాయి ఆ రోజు. అన్నీ నాలుగు దిక్కులకూ పారిపోతూ ఈ కొంగ సంగతి ఆజా పట్టించుకున్నట్లే లేవు. గుంపులో వక కొంగ తగ్గిపోయిందనే భావం వాటిలో వున్నట్టు కనిపించలేదు. అలాగే చూస్తూ నిలబడిపోయాను. చాలా సేపయిన తర్వాత ఒక కొంగమాత్రం వచ్చింది. అక్కడే చాలా సేపు తిరుగాడింది. ఆ రాత్రి నేను పడుకున్నప్పుడు దాని అరుపులు వినబడుతూనే వున్నాయి. నా కెప్పుడు నిద్రపట్టిందో తెలియలేదుగాని తెల్లవార్లూ ఆ కొంగ నా కళ్ళముందున్నట్లు, అరుస్తున్నట్లు అనిపించింది. మెలకువవచ్చి చూచేటప్పటికి ఒక పోలీసు కొంగ నొకదాన్ని కాళ్ళు పట్టుకుని తీసుకుని వస్తూ 'రాత్రి రెండు కొంగలు పడ్డాయిరా... రెండోది ఇప్పుడు కనపడింది...' అంటూ పక్కవాడితో చెప్పటం వినిపించింది నాకు. ఈ గుండు దెబ్బకే పడిపోయిందో, ఎలా చచ్చిపోయిందో నాకు అర్థంకాలేదు. మొత్తంమీద బలవంతం చావు అని నిర్ధారణగా నాకు తెలుసు.

రాళ్లు కొట్టటం పని ఇలా వుండగా కొండ కిందనే కూలిపని ఒకటి వచ్చింది. మమ్మల్ని అక్కడకు తీసుకుపోయారు. అక్కడ పని గూడా కాయ కష్టం సంబంధమైనదే. నీళ్ళు తోడిపొయ్యాలి. మట్టి తట్టలు, సిమెంటు బొచ్చలు మొయ్యాలి. వరుసగా లైనులో నిలబడి పక్కవాడికి బరువు అందిస్తూ, రెండోపక్క నుంచి బరువు అందుకుంటూ వుండాలి. ఎండ చురుక్కుమంటోంది. నెత్తిన చుట్టకుదురు సూర్యరశ్మికి ఆచ్ఛాదనగావుంది. వళ్లంతా చెమటలు పట్టి,మట్టి కొట్టుకుని వికృతంగా తయారయింది. ఒకరోజు కలిగిన మానసిక పతనానికి ఎన్నో రోజులశిక్ష. ఒకరి జీవితం పూర్తిగా అంతమయిపోయిందన్న మాట తోచలేదు. నేను తప్పు చేసింది ఒక్కరోజేగదూ! అదే నాకు గుర్తుంది.

ఆ సాయంత్రం కొండమీది గుడారాలు పీకి మేమే కిందికు తీసుకు వచ్చాం. సీలలు వేసి, తాళ్ళు బిగించేటప్పటికి బాగా పొద్దెక్కింది. మేమంతా మళ్లీ పడకలు చూసుకోవటం, సామాను దాచు కోవటం పనిలో నిమగ్నమయిపోయాం. ఖూనీలు చేసిన మాకే ఎవరో దొంగలు మా సామాన్లు ఎత్తుకు పోతారేమోనన్న భయం కలగటం నిజంగా ఆశ్చర్యమే. అన్నీ సర్దుకున్నాం. కూలీలంతా ఇళ్లకు వెళ్లిపోయారు. ఒక కూలీమాత్రం అక్కడే ఆగిపోయింది. ఆమెకు మా గుడారాల దగ్గర ఏంపని వుందో నాకేం అర్థంకాలేదు. రేగిన జుట్టు, చింపిరి బట్టలు, చూడటానికి బాగానే వుంది. నవ్వుతున్నట్లుగా వుంటుంది ముఖం. భగవంతుడి సృష్టిలోవున్న లోపం అనుకుంటాను ఆ నవ్వు. అది ఎవరిని చూసి నవ్వటమూగాదు. ఆ ముఖం నవ్వు తున్నట్లు వుంటుంది అంతే. ఆమె ఆ రాత్రి ఇంటికి పోయినట్లు లేదు. ఆ గుడారాలదగ్గరే వుండిపోయింది. అర్థరాత్రప్పుడు నాకెందుకనో మెలకువ వచ్చి లేచి

చూశాను. నవ్వు వినబడుతోంది. ఒక గుడారంలో దీపం మిణుకు మిణుకుమంటూ వెలుగుతోంది. అది ఎవరి గుడారమో నేను గుర్తుపట్ట లేదు. శ్రీ శ్రీ చెప్పిన 'అర్ధనిమీలిత నేత్రాల భయంకర బాధల బాటల పల్లవి' అన్న మాటలు గుర్తుకు వచ్చినాయి. కడుపు దహించుకు పోయినట్లు అనిపించింది. ఏడవగలిగినంత సేపు కళ్లనీళ్ళు పెట్టుకున్నాను. తలకింది బండరాయిమీద నీళ్ళు నిలబడ్డాయి. 'ఎవరో పాపం ఆమె...' అనుకుంటూ నిద్రపోయాను. ఆమెవరో తెలియదు నాకు. ఆర్థిక వ్యవస్థ ఇచ్చిన ఒక పాపం అనుకున్నాను. రాత్రి ఆమె నిద్రలో కనిపించింది. 'నన్ను శపించక......మా అమ్మ మంచంలో బాధపడుతోంది...ఆమె కోసమే నేనీ పాపానికి ఒడిగట్టాను......' అని చెప్పింది. ఉలిక్కిపడి కళ్ళు తెరిచి చూచాను. కల కరిగిపోయింది. నాకూ, ఆమెకూ తేడా లేదు, 'ఈ పాపాలకు మానవుడు ఇచ్చే శిక్షలు సరిపోవు. భగవంతుడే చెయ్యిచేసుకోవాలి' అనిపించింది.

నాకక్కడ బాగానే వుంది. నేను చేస్తున్నపనిలో తృప్తి వుంది. నా సేవ, నా కాయ కష్టం ప్రజోపయోగకరమైన ఒక పనికి వుపయోగిస్తోంది. దానికి ప్రతిఫలం కోరుకోవటం లేదు. భారతదేశం అభివృద్ధి పొందటానికి నా శరీరాన్ని ఏదో విధంగా ఉపయోగింపగలుగుతున్నాననేదే నాకు కొంచెం సంతృప్తి కలగిస్తున్నదన్నమాట. అయినా ఆ పని నా మనఃపూర్వకంగా చెయ్యటం లేదు. ఎవరో అధికారం చూపించి చేయిస్తున్నారు అది నేననుభవిస్తున్న శిక్ష అనేమాట నన్ను వెంటాడు తూనే వుంది. నన్ను తీవ్రంగా ఆందోళన పరుస్తూనే వుంది.

ఆ ప్రసక్తి వచ్చినప్పుడల్లా నా వళ్ళు జలదరించేది. శరీరమంతా గగుర్పొడిచినట్లనిపిస్తోంది. నా ఆగ్రహం చల్లారిపోయింది. ఇప్పుడు

నాకు దుకాణదారు రామదాసుమీద కోపం లేదు. అతను చచ్చిపోయా డనిగాదు. నాకు కోపకారణమయిన విషయాలను రెండు వైపులా చూడ గల దృష్టి నాకు లభ్యమయింది. పరిస్థితులు, వాటి ప్రభావాలు అన్ని టినీ సమన్వయపరుచుకుని దూరం నుంచి నిజానిజాలు తెలుసుకోగల స్తోమత లభించింది నాకు. నేను మంచివాణ్ణయ్యాను అనుకున్నాను. దీనికి ప్రోద్బలమిచ్చింది అక్కడి ఖైదీలతో సహచర్యం. ఖూనీలు చేసి సంపాదించుకుని తినటమే వృత్తిగా కొద్దిమంది రౌడీలు మొదలు, ఏదో తాత్కాలికమైన ఆగ్రహంలో, ఆవేశంలో వళ్ళు తెలియక ఖూనీలు చేసిన వాళ్ళవరకు అనేక మంది కలిశారు. మనస్పర్థలు, పేదరికం రెండే కారణాలు నాకు కనిపించింది. పేదరికం అంటే ఎటువంటి శాపమో నాకు తెలుసు. స్వయంగా అనుభవించినవాడిని. మనస్పర్థలు అంటే ఏమిటో తెలిసింది. పొలం తగాదాలు, ప్రేమ వ్యవహారాలు—అసూయలు వీటికసలు అర్థంలేదు. దుఃఖం సుఖం అంటేనే అర్థంలేని మాటలవి. ఆత్మజ్ఞానం లోపించటంవలన కలిగే ఒక మానసిక వికాసం, మానసిక దౌర్బల్యం—— నేనెవర్ని......భౌతికమైన కొద్ది లాభాలు, నష్టాలు సుఖదుఃఖాలుగా చెల్లు బాటవుతూ వాటి మధ్య నలిగి పోతున్నాయి జీవితాలు. నీరూ, తామరా కూలాంటివి మనిషి జీవితం. తామరాకు ఎప్పుడు నీటిపైనే వుంటుంది నీటికీ, తనకూ ఏమీ సంబధం లేనట్లు. కానీ దానికి ఆహారం, నిలబడ టానికి చోటూ నీరే ఇస్తుంది. వాటిని తీసుకుని తామరాకు నిశ్చలంగా నిల బడుతుంది. కొద్ది నీరు ఆకుమీదకు ఒరిగినా తామరాకు తడవదు. దుఃఖిం చదు. వచ్చిన నీరు అలాగే కొంత సేపు తచ్చాటలాడి మళ్లీ నీళ్లలో కలిసిపోతుంది. సుఖదుఃఖాల్నిగూడా మానవుడు అలాగే చూడాలని నాకు మొదటసారిగా అనిపించింది. అన్నిటినీ చూడాలి. అనుభవించాలి.

అంతేగాని దానితో ఒకటై పోకూడదు. ఆ ఆత్మజ్ఞానం ఉంటే హత్యలు, దోపిడీలు ఎందుకు, ఈ జైళ్ళు ఎందుకు.? అనుకున్నాను.

నేను ఆలోచించుకున్నకొద్దీ ఆవేదన పెరిగిపోయింది. నా మనస్సు వికాసం పొందింది. నా హృదయం ఏదో కొత్త తేజస్సుతో వెలిగిపోయింది. నేను మంచివాణ్ణయ్యాను. నలుగురినీ మంచివాళ్ళను చెయ్యాలి అనే భావన బాధ నన్ను తలక్రిందులు చేసింది. నా గోడంతా తోటిఖైదీకి చెప్పాను. నవ్వి ఊరుకున్నాడతను.

'వెర్రి ఆలోచనలు మానుకో...' అన్నట్లుంది ఆ చూపు.

ఆ రోజు సాయంత్రం జైలు అధికారి దగ్గరవుండే పోలీసు నా దగ్గరకువచ్చినప్పుడు చెప్పాను నేను మంచివాణ్ణయినాను' అని...మంచివాడిని జైలులో బంధించే అధికారం ఎవరికీ లేదు. జైలు మంచివాళ్ళ కోసం కాదు ? అనుకున్నాను. అయితే, ఒకమాట మటుకు స్ఫురించలేదు. నేను చేసిన పాపానికి శిక్ష అనుభవించవద్దూ ? పశ్చాత్తాపం పాపానికి విరుగుడవుతుందా ! విషం తాగిన తరువాత అది విషమని తెలుసుకుంటే మాత్రం మనిషిని లోలోపల దహించివేయకుండా వుంటుందా ! ఈ ఆలోచనలన్నీ రాలేదు ఆనాడు. పోలీసుతో చాలాసేపు చెప్పాను. నన్ను వదిలిపెట్టేసే ఏర్పాటు చేయవలసిందిగా అధికారితో విన్నవించమని చెప్పాను.

ఆ పోలీసు పోయి ఏం చెప్పాడో ఏమో తెలియదు జైలు అధికారి వెంటనే వచ్చాడు నేనున్న చోటికి. ఆయన పాదాలమీదపడి, కన్నీటితో కడిగి నన్ను వదిలెయ్యమని ప్రార్థిద్దామనుకున్నాను. కన్నీళ్ళ బరువును లెక్కగట్టగల నియమాలు జైలు రూల్సులో వుండవు. ఆ విషయం నాకు

తెలియదని గాదు. నేను మంచివాణ్ణయ్యాను. నన్ను విడిగా బ్రతక నీయండి' అని చెబుదామనే నా ఉద్దేశం. కాని, ఆ అధికారి కర్కశమైన చూపులు నన్నేమీ మాటాడనియ్యలేదు.

'ఏం పారిపోదా మనుకుంటున్నావట గదా... డొక్క చీల్చేస్తాను... ఆయ్ !...' అంటూ గద్దించాడు అతను.

నేనేదో చెబుదా మనుకున్నాను. పారిపోదామని నే ననుకోలేదు. నా మనసులో మాట బయటకు చెప్పలేకపోయాను. తల వంచుకుని అలాగే నిలబడ్డాను.

'ఈ రాత్రికి కాళ్ళకుగూడా బేడీలు వేయండి...రేప్రొద్దున బండీలో రాజమండ్రి పంపేద్దాం. . బ్రూట్స్...' అంటూ వెళ్ళిపోయా డతను. పోలీసు అతని వెనకాలగా కొంతదూరం దాకా అనుసరించి సాల్యూట్ చేసి నా దగ్గరకు వచ్చి విషపునవ్వు నవ్వాడు. నేనేమీ మాట్లాడలేదు. గది లోకి వచ్చిన తర్వాత చేతికి కాలికి బేడీలు వేశాడు. ఆపూట తిండిలేదు. నాకీ బేడీ లెందుకు ? పిచ్చివాడిని కాదుగదా ! ఈ బేడీలతో పుట్టలేదే నేను ! అనుకున్నాను. ఆ జైలు అధికారి రావటం, పోవటం నా మన స్సులో ఊరికే మెదులుతున్నాయి. పారిపోదా మనుకున్నావా అని ప్రశ్నించాడు గదూ ! అంత దొంగ ననుకొన్నాడా ? అనిపించింది. ఒకక్షణం అయిన తర్వాత మెరపులా ఒక ఆలోచన తట్టింది. నిజంగా పారిపోతే !

ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు కాళ్ళు ముడుచుకుని పడుకుందా మనుకుంటే బేడీలు అడ్డు వస్తున్నాయి. ఎటుతిరిగి పడుకోవటానికి వసతి కుదరలేదు. తలకింద బండరాయి కింద గోనెసంచీ. బయటనుంచి ఒక

రాత్రివేళ మంచి చల్లటి గాలి ప్రారంభమయింది. పక్క తీసేసి ఆ గోతాన్నే కప్పుకుని పడుకోవటానికి ప్రయత్నం చేశాను. అప్పటికి చలి ఆగలేదు. దానితో ఉండబట్టలేక గోతాన్ని తన్నేసి కాళ్ళు, చేతులు చాచి నిర్భయంగా వెల్లకిలా చలిని ఎదిరించిన ధీరుడిలాగా పడుకున్నాను. మగతగా కొంచెంసేపు నిద్రపట్టి మళ్ళీ వెంటనే మెలకువ వచ్చింది. అప్పుడే తెల్లవార వస్తున్నట్లుంది. కోళ్ళు తిరిగేచోటు కాదది. ఆకాశంలో తెల్లటి రేఖలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. మా గుడారానికి కొద్ది దూరంలోనే చలిమంట వేసుకుంటున్నారు. అక్కడకు పోయి కూర్చుంటే జీవితంలో ఇంకేమీ కోరుకోను ? అనుకున్నాను ఆ క్షణంలో.

సూర్యోదయం ఎవరికోసం ఆగదు. చూస్తుండగానే పొద్దెక్కింది. మళ్ళీ పనిలో ప్రవేశ పెట్టారు. తట్టలు అందించటం అదీను. నన్ను నలుగురి మధ్యగా నిలబెట్టారు. నాపక్కకు పోలీసులువచ్చి చూచిపోవటం ఎక్కువయింది. పారిపోతే పట్టుకుని తను ప్రతాపం చూపిద్దామని వాళ్ల తాపత్రయం. అందరి మధ్య నుంచి పారిపోవటానికి ప్రయత్నించటం గూడా ఒక పిచ్చి పనే. పట్టుబడక తప్పదు. దానిలో దెబ్బలు ఎక్కువగా తగలటం ఒకటే ప్రయోజనం.

రోజులు గడుస్తున్నకొద్దీ ఆ చెర నుంచి తప్పించుకుపోవాలనే కాంక్ష నాలో ఎక్కువ కాసాగింది. ప్రతిరోజూ ఇంటిదగ్గరవాళ్లే గుర్తుకు వచ్చేవాళ్లు. నా మనసులోని బాధంతా తోటి ఖైదీలతో చెప్పుకునేవాడిని. అతనికి గూడా పారిపోదామనే ఉన్నదట! వీలుకాక ఊరుకున్నాడు. అందరూ పారిపోతే ఎట్లా ?

నాలో కలిగిన సంక్షోభం బయటకు బాగానే పొక్కేసింది. నన్ను

ఒకరోజున మళ్ళీ రాజమండ్రికి పంపేశారు. పరిచయమైన చోటే. కట కటాలు, రాతిగోడలు, గంట కొట్టినప్పుడు భోజనం, గంట కొట్టినప్పుడు నిద్ర. అన్నీ యాంత్రికంగా పశుప్రాయంగా జరిగిపోవటం ప్రారంభ మయింది. నామీద కలిగిన అనుమాన ఫలితం ఏమంటే నన్ను జైలు ఆవరణలో గూడా ఎక్కువగా తిరగనియ్యటం లేదు. జైలులోపల మట్టి ఊడ్చటం. అక్కడ వున్న గడ్డి, పిచ్చి మొక్కలు పీకటం. రెండు పెద్ద కొబ్బరి చెట్లూ, ఒక నారింజ చెట్టూ వున్నాయి అక్కడ. వాటికి కుదురు చెయ్యాలి. నీళ్లు తెచ్చి పొయ్యాలి. ఇలాంటి పనులు సాగు తున్నాయి.

జైలరుతో పోయి వకసారి మాట్లాడదా మనిపించింది. అది కుదరనే లేదు. గది తాళం వేస్తూ తీస్తూవుండే బంట్రోతుతో పరిచయం మెల్లిగా చేసికున్నాను. నా పూర్వ జన్మ సుకృతమో, నా ముఖంలోని సౌమ్య భావమో అతన్ని ఆకర్షించివుండాలి. నావంక జాలిగా చూస్తాడు. మనసిచ్చి మాట్లాడితే సానుభూతి చూపిస్తాడు. ఎప్పుడన్నా 'అన్నం తిన్నావా......' అని అడుగుతాడు. 'రాత్రి నిద్ర పట్టిందా...' అని అడుగుతాడు. అన్నింటికి 'ఆ...ఆ...' అని సమాధానం చెబుతూ ఇంకా కొన్ని విశేషాలు అతనికి చెబుతూవచ్చాను. ఆరోజు పులుసులో ముక్కలు బాగా వుడకలేదనో, రాత్రిపూట నల్లులు కుట్టాయనో... దోమలు బాగా తిరుగుతున్నాయనో చెపుతాను. అట్లాగా పాపం అంటా డతను. తరువాత ప్రపంచంలో విశేషాలు చెబుతాడు. వాటిమీద చర్చ జరుగుతుంది. ఎవరన్నా జైలుఅధికారి చూస్తే అతని ఉద్యోగానికి ప్రమాదం. ఆ భయం అతన్ని అప్రమత్తునిగానే ఉంచుతూ వస్తోంది.

లేకపోతే ఏముంది పాపం! నలుగురు ఆడపిల్లలట. పెళ్లానికి ఎప్పుడూ ఏదో సుస్తీయట. పిల్లలు చదువుకుంటూ మంటారు. తనకు వచ్చే సంపాదన భోజనానికి బటాబటీ సరిపోతుందిట. అప్పుడప్పు డతనింట్లో కష్ట సుఖాలు చెప్పుకుంటూ ఉంటాడు. ఆడపిల్ల పెద్దదానికి పద్దెనిమిదేళ్లు కార్తీక మాసానికి వెళ్లి పోతాయిట. రోగిష్టిభార్య మంచంలో పడుకుని దానికి పెళ్లి చెయ్యలేదని సాధిస్తుందట. ఇరుగు పొరుగు వాళ్లు ఏమనుకుంటున్నది వర్ణనాతీతంగా చెబుతుందట. తను ఏమీ అనలేడు. ఏదన్నా అంటే జుట్టుపీక్కుని ఆఘాయిత్యంచేసి పెద్ద పెట్టున ఏడుస్తుందట. అందుకని ముభావంగా ఉంటున్నాడట అతను. అతన్ని చూస్తే జాలివేసేది నాకు. జీవంలేని అధికారాన్ని సూచిస్తున్నట్లు ఒక చినిగిపోయిన కోటు వేసుకు వస్తాడు. ఎర్రటి రుమాలు తలకు చుట్టుతాడు. దుడ్డుకర్ర చేతిలో ఎప్పుడూ వుంటుంది. బూట్లు పెద్ద పెద్దవి వేసుకుంటాడు. కొంతకాలం మిలిటరీలో పనిచేశాడట. ఆనాటివి ఆ బూట్లు. తుపాకి కాల్చటం గూడా చేతవచ్చు అంటాడు. కాని అతను తుపాకి కాలుస్తుండగా ఎప్పుడూ చూడలేదు నేను. వయసు వచ్చినా పన్నువక్కటయినా ఊడలేదు. అతను నవ్వితే దానిమ్మగింజల్లాగా పలువరస అంతా కనపడుతుంది.

'ఎందుకు తాతా ఈ శ్రమ...' అని అడిగాను ఒకరోజున తాత దగ్గుతూ నా దగ్గరకు వస్తే. తెరలు తెరలుగా దగ్గుతున్నాడు. ఎంతో బాధగా అనిపించింది.

'ఎందుకా...నా బొందకు...' అన్నాడు నిజంగానే పెద్దవాడయ్యాడు. ఈ లోకం వదిలి పరలోకం సంగతి చూచుకోవలసిన సమయం ఆసన్నమవుతున్న దతనికి.

'నన్నెప్పుడు వదిలిపెడతారు తాతా......' ఎంతో మెల్లిగా అడిగాను. తాత ఉలిక్కిపడి 'ఏమన్నావు...మళ్లా వకసారి అను....' అంటూ దగ్గాడు గట్టిగా.

'వద్దులే తాతా...మళ్లీ ఇంకోసారి చెబుతానుగా—' అన్నాను.

'మళ్ళా ఇంకోసారి చెబుతావు.... నన్ను ఇల్లా బ్రతుకనియ్య దలచుకోలేదా ?' అన్నాడు తాత.

'అదికాదు తాతా... నాకు వెళ్ళిపోదామని వుంది. ఇక్కడ వుండలేను...' అన్నాను.

'నువ్వు ముందు లోపలకు పద... అసలు నాతో మాట్లాడవద్దని చెప్పలా... పో లోపలకు.. అంటూ నన్ను కర్రతో వెనక్కు వెనక్కు తోసి జైలు గదిలో పెట్టి తాళం వేసేశాడు. గబగబా కర్ర బూట్లు చప్పుడు చేసుకుంటూ బయలుదేరాడు. పది అడుగులు వేసినవాడు ఎందుకనో వక క్షణం ఆగి నా వంక చూసి 'ధూ' అని ఉమ్మేసి ముందుకు చరచరా సాగిపోయాడు.

'తాతా...' అని బిగ్గరగా అరుద్దామనిపించింది గాని భయంవేసి వూరుకున్నాను.

మరురోజు పొద్దున పనికోసం తలుపు తీశాడు తాత.

'ఏం తాతా నేను మంచివాణ్ణి కాదా ఇప్పుడు...' అన్నాను.

'అయితే ఏమంటావు...' అన్నాడతను. బింకంగా అక్షరాలన్నీ వత్తి పలుకుతూ...

'నన్నీ జైల్లో ఎందుకు వుంచారు... నన్ను బయటకు వెళ్ళిపో నియ్యకూడదూ...' అన్నాను. నాకు ఎంతో దుఃఖం పొర్లుకు వచ్చింది. ఆపుకోలేక పోయాను. బిరబిరా కళ్ళవెంబడి నీళ్ళు కారిపోయినాయి. అతను ఒకక్షణం ముఖం వాల్చినవాడల్లా మళ్ళీ ఒక్కసారిగా తలెత్తి 'హు... ఇంకా మరిచిపోలేదన్న మాట...' అంటూ గొణిగాడు.

'తాతా అటొక్కసారి చూస్తావు...' అన్నాను.

'ఎటు...? తాత విసుక్కున్నాడు. నేను నీళ్ళు పోస్తున్న కొబ్బరిచెట్టు వంక చూపించా. ఏపుగా వస్తున్న మొవ్వ, పువ్వూ కన పడుతున్నాయి.

'ఆ మొక్కకు నే నొక్కడినే నీళ్ళు పోస్తున్నాను... నేను పాపిష్టి వాడినయితే ఆ చెట్టుకు పువ్వు పడుతుందా తాతా...' అని అడిగాను. తాత పువ్వువంక చూస్తున్నాడు. తెల్లగా కనపడుతున్నాయి. మళ్ళీ నా వంక చూశాడు. నేనే అన్నాను.

'ఆ పువ్వుమీద ప్రమాణంచేసి చెబుతున్నాను... నన్ను విడిచి పెడితే మంచిగా బ్రతుకుతాను...' అని.

తాత హుంకరించి వెళ్ళిపోయాడు. పోలీసులు మామూలుగా వచ్చి మమ్మల్ని అన్నాలు తినేచోటికి తీసుకుని వెళ్ళారు. చెడ్డవాళ్ళని సంఘంలో తిరగనియ్యటం ఎంత పాపమో, ఎంత శిక్షార్హమో, మంచివాళ్ళని జైళ్ళలో బంధించటమూ అంతే అనుకున్నాను. నా కా పూట అన్నం తినబుద్ధి పుట్టలేదు. మూకుడులో పెట్టిన అన్నమంతా అలాగే వదిలేసి మామూలుగా మూకుళ్ళు కడుక్కునేచోట వదిలేశాను. ఆ రాత్రిగూడా

అన్నం వదిలేశాను. నా గది తలుపుకు తాళం వేస్తూ తాత 'ఏం అన్నం తినకుండా చద్దామనుకుంటున్నావా...' అన్నాడు.

'నాకు స్వేచ్ఛ లభించేవరకు అన్నం ముట్టుకో దలచుకోలేదు...' అని చెబుదామనుకున్నాను. తాత నా సమాధానం కోసం ఆగలేదు. విసుక్కుంటూ తను అనదలచుకున్నమాట అనేసి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత తాతతో నేను ఎక్కువగా మాట్లాడటం మానేశాను. తాతగూడా ముభావంగానే వుంటూ వస్తున్నాడు. నా కెందుకో ఆ కొబ్బరి చెట్టువంక చూస్తుంటే వస్తున్న పువ్వు కొంత నిలిచి, పిందెలుపడి, పెద్దవి అయితే... ఆ చెట్టుకింద కూర్చుని ఒక కొబ్బరికాయ కొట్టుకుని నీళ్ళు తాగాలనిపించింది. అది ఎటువంటి ఆలోచనో నాకు తెలియదు. అక్కడ కొబ్బరికాయలు పెద్దవి అయితే నా మంచితనానికి రుజువు దొరికినట్లని నా ఉద్దేశం. చాలా దూరమైన ఆలోచన అది. ఆ మాట అందరికీ అర్థం కాదు.

అదీ వంకగానే అనిపించింది. అక్కడ వుండలేననే నిర్ణయం చేసుకున్నాను. నాలో స్వేచ్ఛా వాయువులు పీల్చాలనే వాంఛ ప్రబలినకొద్దీ నా మీద పోలీసు కాపలా, నిఘా ఎక్కువగా అవుతోంది. గది తలుపు తీసినప్పుడల్లా ఇద్దరు పోలీసులు వస్తున్నారు. మళ్ళీ లోపలపెట్టి పోతున్నారు. తాత తాళంవేసి పోతాడు. ఇప్పుడు నాతో మాట్లాడటం మానేశాడు. అతను నా మాట అర్థం చేసుకునే స్థితిలో లేడు. నా హృదయం దహించుకు పోతోంది. ఎలాగయినా సరే నేను బయటకు వెళ్ళిపోవాలి అని దృఢసంకల్పం చేసుకున్నాను.

ఆ రోజున జనవరి 26, రిపబ్లిక్ వుత్సవాలు జరుగుతున్నాయట వూళ్ళో. అక్కడ పోలీసు బలం వుపయోగించవలసి వచ్చింది జన సందోహాన్ని అదుపులో పెట్టటానికి. ఊళ్ళో ఏం జరుగుతున్నదో మాకు తెలియటం లేదు. జైలు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారని తెలిసింది. అది పైన ఎగురుతుండగా నా గదిలోనుంచి కనపడుతుంది. నీలి ఆకాశంమీద మూడు రంగుల జండా రెపరెపలాడుతుంటే నా హృదయం పులకరించింది. స్వాతంత్ర్యం... స్వాతంత్ర్యం. నాకు స్వేచ్ఛ కావాలి. గొంతులోపలే పెద్ద పెట్టున అరిచాను. నానాడులన్నీ ప్రతిధ్వనించినాయి. ఆ రాత్రి తాత నా గది తలుపు తీయటానికి వచ్చాడు. ఎర్ర రుమాల తలపాగా, కోటు, మిలిటరీ బూటు, టకటకలాడే పొన్ను వేయించిన చేతికర్ర... ముఖావంగా వచ్చాడు. జైలు గోడలమీద బలుబులుతో అలంకరించారు. తాత ఆ వెలుగులో నా ఆశాజ్యోతిలాగా కనిపించాడు. తలుపు తియ్యటంతోనే అతని చేతులు రెండు గట్టిగాపట్టుకుని నన్ను వదిలిపెట్టు ఆజన్మాంతం నీకు కృతజ్ఞుణ్ణిగా వుంటాను...' అన్నాను. తాత ఉలిక్కి పడ్డాడు. నాకళ్ళు ఎర్రగా మండిపోతున్నాయి. అతను ఉలిక్కిపడ్డాడు.

అతన్ని గట్టిగా వూపేస్తూ 'నన్ను వదిలెయ్యి... నన్ను వదిలెయ్యి..., అంటూ ప్రాధేయపడ్డాను. తాత కళ్ళు చెమర్చినాయి.

'వీల్లేదు... నా వుద్యోగం వదులుకోలేను...' అంటూ గొణిగాడు తాత. నా సహనం హరించిపోయింది. తాళలేక పోయాను.

'వీల్లేదూ... ఎందుకు వీల్లేదూ... అదేదో ఇవ్వాళ తేల్చాలి...' అంటూ అతన్ని కదిలించి పారేస్తూ అన్నాను. బిగ్గరగా అరవటానికి

అవకాశం లేదు. ఎవరన్నా వస్తారేమోనన్న భయం బాధిస్తోంది. తాత ముఖం అంతా చించుకుని 'నన్నడిగితే ఏం చెప్పాలి...' అంటూ ఆవేశంతో వణికిపోతూ అన్నాడు. ఇక వుండబట్టలేక పోయాను. నాకు ఎవరిమీద కోపమో తెలియలేదు. బహుశా ఆ కోపం అంతా నా మీదనే నేమో? ఆ దుకాణం రామదాసుని ఎందుకు కొట్టాను. తెలిసిన కారణాలు మళ్ళీ తవ్వుకోవటం దేనికి. ఇప్పుడు జరగవలసిన పని ఏమిటి!' అని తీవ్రంగా ఆలోచించాను. తాత ఇంకా తలుపు పట్టుకునే నిలబడ్డాడు. సాయంత్రమే నా భోజనం అయిపోయింది. మళ్ళీ తాత ఇప్పుడెందుకు వచ్చాడు. నన్నేడిపించటానికా? ఎంత సేపు నా గురించిన ఆలోచనలే వస్తున్నాయి. ఎందుకు వచ్చాడతను? కారణాలు అడుగుతున్నాడు గదూ! నా కాళ్ళకింద భూమి కదిలిపోతున్న ట్లనిపించింది.

'తాతా......నిన్నడిగితే ఈ కారణం చెప్పుకో...' అంటూ అతని చేతులోని కర్ర లాక్కుని బలంకొద్దీ అతని తలమీద మోదాను. తాత అరవనుగూడా లేదు. గిర్రున తిరిగి పడిపోయాడు. అతనికేమయిందో నాకు చూడాలనే లేదు. అతని తలపాగా తీసి నా తలకు చుట్టుకున్నాను. అతని కోటు వేసు కున్నాను. బూటు గూడా వేసుకుందామను కున్నాను. టైము లేదు. గుండె విపరీతంగా కొట్టుకుంటోంది. కర్ర తీసుకున్నాను. దానిమీద ఎర్రగా రక్తం చిందిన మరక కనబడింది, నా కళ్ళుతిరిగినాయి. భయం వేసింది. ఏమయిందో? ఈసారి ఉరిశిక్ష పడుతుంది నాకు. కర్రను తాత ధోవతీకి బాగా తుడిచి టకా టకా చప్పుడు చేసుకుంటూ చకచకా బయటకు వచ్చేశాను. నన్నెవరూ గుర్తించలేదు. నాకు ధోవతీ కట్టుకోవాలని తోచలేదు చాలా భయం వేసింది. పెద్ద గేటు దాటు తుండగా కాపలా పోలీసు అనుమానించాడు. ఏదో అడగబోయాడు.

వెంటనే నా మొలకు కట్టుకున్న బంగారపు తాయెత్తు లాగి విసిరి అతని ముందు పడేశాను. అతను ఏదో అరవబోయాడు గాని తళుక్కున మెరసిన బంగారపు తాయత్తు చూసేటప్పటికి అతని నోరు కట్టుబడిపోయి వుండాలి. కాలికి బుద్ధిచెప్పి విపరీతంగా పరుగెత్తాను. ఇలా వచ్చాను."

రమణ ఇంతవరకూ చెప్పి ఆవేశంతో వణికి పోతున్నాడు శారద నిశ్చేష్టురాలైంది. ఆమె కళ్లల్లో నీళ్లన్నీ కారిపోయినాయి. వేణు ఇంకా నిద్రపోతూనే వున్నాడు. శారద వణికిపోతూ 'మీరు మంచిగా బ్రతకాలని...మంచిగా బ్రతుకుతున్న తాతను చంపి వచ్చారా......' అంటూ గొణిగింది. ఆమె ముఖంలో భావన, ఆమె అన్నమాటలు రమణకు ఆఘాతంలా తగిలినాయి. కంగారు పడిపోయాడు.

'నేను తాతను చంపానా...నేనేం చెయ్యను......నన్నేం చెయ్యమంటావు......' అంటూ విపరీతంగా కంగారుపడుతూ శారద కళ్లల్లోకి సూటిగా చూశాను. శారద కళ్ళు చీకటిగా వున్నాయి. ఆమె ముఖం పాలిపోయివుంది. ఏగో బాధ, పరిష్కారం గాని సమస్య......ఆమె ముఖంలో పేలవంగా ప్రతిఫలిస్తున్నాయి.

రమణ మనస్సులో ఏదో తళుక్కున మెరిసింది.

చేతులు పట్టుకుని శూన్యదృక్కులు ప్రసరిస్తున్న శారదను గట్టిగా విదిలించుకుంటూ 'తెలిసింది......నా స్థానం ఎక్కడో తెలిసింది......అక్కడికే పోతాను..... నేనక్కడికే పోతాను......' అంటూ ఒక్కసారిగా నిలబడి వీధిలోకి పరుగెత్తాడు. శారద స్తబ్దురాలైంది. మరుక్షణం లోనే తెలివి తెచ్చుకుని రమణ వెంట వీధిలోకి పరుగులెత్తుకుంటూ వెళ్లింది. రమణ ఆ చీకటిలో కలిసి దూరంగా వెళ్లిపోతున్నాడు. ఆమె

గొంతుపెగల లేదు. ఏదో కేక వెయ్యాలని ఆవేదనతో ఎత్తిన ఆమె చెయ్యి వాల్చేసింది.

ఆ రాత్రి ఆమెకు నిద్రపట్టలేదు. తెల్లవారు జామున వేణు నిద్ర లేస్తూ 'రాత్రి...ఎవరమ్మా వచ్చింది...' అని అడిగితే శారద గుడ్లనీరు కుక్కుకుంటూ 'బూచి' అంది.

(ఆంధ్రప్రభ 1958)

—: o :—